నేటి కందం-నేటికి అందం

ఎగుమతులను దిగుమతులను
సుగమమ్మొనరించు పెక్కు సుంకమ్ములపై
తగు చర్చలు జేయుకొరకు
మొగి వెనిజుల డెల్సి వచ్చె మోడీని గనన్ !!

(వాణిజ్య విషయాల మీద మోడీ తో చర్చించడానికి వెనిజులా అధ్యక్షురాలు డెల్సీ భారత్ కు వచ్చింది భారత దేశ అభివృద్ధిని చూచి ఆశ్చర్యం వ్యక్తం చేసింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటినిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

దోచుకున్న తెలంగాణ
దోషులంతా ద్రోహులే
అధికారం హై బీపిలో
అవినీతి హృద్రోగులే.
రాజకీయ పరిభాషలో
రోజు రోత బూతులే
సొక్కమెవరు కాకున్నా
సుద్దపూస నీతులే

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 5-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:236 పేజిలు:6 వెల: రూ.1/-


# ఎత్తిపోతల పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

## -మక్తల్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి
## -కాట్రపల్లి పంప్‌హౌస్ పనులపై ఆరా
## -ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్, జూన్ 4: ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గురువారం మక్తల్‌కు చేరుకున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన ముఖ్య మంత్రికి రాష్ట్ర మంత్రులు డాక్టర్ వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణా రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.

అనంతరం మక్తల్- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాట్రపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతి, నిర్మాణ పనుల స్థితిగతులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు.

పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.



అనంతరం జూరాల, కోయిల్ సాగర్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాంతాలను సీఎం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించనున్నారు. సాయంత్రం సోమశిలకు చేరుకుని ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ ఎ. సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి భూముల ధరల పెంపు

-మంత్రి పొంగులేటి



హైదరాబాద్, జూన్04: మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాటాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు.

ఇక నుంచి సబ్ రిజిస్ట్రర్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూసేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు.

ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

తాను వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన ఫైల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్ల రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసికొని పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైన తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుకవస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. ఒక్కసారిగా వ్యాపించిన మంటలు..



హైదరాబాద్, జూన్ 4: అమీర్‌పేటలో ఈరోజు (గురువారం) భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - ౦1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడుతున్నాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కువైట్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ డ్రోన్ దాడి..

న్యూ ఢిల్లీ, జూన్ 4: కువైట్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ డ్రోన్ దాడిచేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 67 మంది గాయపడగా, ఒక భారతీయుడు మరణించాడు. కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 1పై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఈ ఘటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

మరోవైపు ఎయిర్‌పోర్టుకు కూడా భారీ నష్టం సంభవించింది. రూఫ్‌టాప్ కూలిపోయింది. గాయపడిన వారిలో విమాన ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. ఎయిర్‌పోర్టుపై దాడి జరగడంతో విమాన సర్వీసుల్ని నిలిపివేస్తూ ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిర్ణయం తీసుకుంది. పలు అంతర్జాతీయ విమానాల్ని ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. ఇరాన్ డ్రోన్ దాడి ఘటనతో భారీ పేలుడు సంభవించింది. మంటలు భారీగా ఎగసిపడ్డాయి. పొగ చాలా దూరం వరకు అల్లుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కువైట్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తన ఎక్స్ ఖాతాలో విడుదల చేసింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

# తెలంగాణ ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తాం: కె.కేశవరావు



హైదరాబాద్, జూన్ 4: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు (కేకే) స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు.

### నష్టపోయిన వారందరికీ న్యాయం చేస్తాం: మంత్రి పొన్నం

ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు.

కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

### ఉద్యమ జేఏసీలను కలుస్తాం: ఎమ్మెల్సీ కోదండరాం

ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు.

### అందరి అభిప్రాయాలతో ఉద్యమకారులను గుర్తిస్తాం: అద్దంకి దయాకర్

ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

# సికింద్రాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. ఆర్టీసీ బస్సు కిందపడి బీటెక్ విద్యార్థి మృతి

హైదరాబాద్, జూన్ 4: నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# ఫారో దీవుల్లో ఘోరం.. 700 కుపైగా తిమింగళాలు, డాల్ఫిన్‌ల ఊచకోత..!



న్యూ ఢిల్లీ, జూన్ 4: నార్త్ అట్లాంటిక్ సముద్రంలోని ఫారో దీవుల్లో ఘోరం జరిగింది. అక్కడి సంప్రదాయమైన 'గ్రైండాడ్రాప్' ఉత్సవంలో భాగంగా ఏకంగా ఒక్క రోజులో 700కు పైగా తిమింగలాలు , డాల్ఫిన్లను ఊచకోత కోశారు. దాంతో సముద్ర తీరం ఎర్రగా మారిపోయింది. మే 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచ సముద్ర పర్యావరణ సంస్థ 'సీ షెఫర్డ్' ప్రకారం.. టోర్షావన్‌లో సాండెగెర్ది బే వద్ద వేటగాళ్లు 402 పైలట్ తిమింగలాలను, నాలుగు బాటిల్‌నోస్ డాల్ఫిన్‌లను ఒడ్డుకు తీసుకొచ్చి.. వాటి శరీరాలని చీల్చారు.

అదేవిధంగా స్కాల బోట్నూర్‌లో 168 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లు, హోల్విక్‌లో 132 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లను చంపేశారు. వాటిని చంపేందుకు ఉపయోగించే ఆయుధాల కొరత ఏర్పడటంతో.. కొక్కేలు, కత్తులు ఉపయోగించి వాటి శరీరాలను చీల్చేశారు. దాంతో అవి ఒడ్డున విలవిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి. ఈ వధను చిన్నారులు సహా అనేకమంది సముద్రపు ఒడ్డున ఉండి చూడటం గమనార్హం. సీ షెఫర్డ్‌లోని ఫారో దీవుల డైరెక్టర్ వాలెంటీనా క్రాస్ట్.. దీన్ని తీవ్రంగా ఖండించారు. అమాయక జంతువులను ఇంత క్రూరంగా బాధించి చంపడాన్ని సమర్థించలేమన్నారు.

ఈ సందర్భంగా ఈ సంప్రదాయాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ సామూహిక వధ అనేది 1000 ఏళ్ల నాటి సంప్రదాయంగా అక్కడి వారు చెబుతున్నారు. అయితే జంతు ప్రేమికులు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆధునిక కాలంలో ఇది అనాగరికమైన చర్య అని, కాలం చెల్లిన పద్ధతిగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వెంటనే దీన్ని ఆపేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ సామూహిక వధకి ముందురోజు ఫారోస్ పార్లమెంటులో వేటాడే డాల్ఫిన్‌ల కోసం ఉన్న సంక్షేమ చట్టాన్ని సవరించడం గమనార్హం.

# రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు

నల్గొండ, జూన్ 4:కుటుంబ పోషణ కోసం హైదరాబాద్‌లో ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్న యువకుడు గురువారం తెల్లవారుజామున కట్టంగూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతే మండలం నామారం గ్రామానికి చెందిన శివరాత్రి వేణు కుమార్ (25) ట్యాక్సీ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న ప్రయాణికులను హైదరాబాద్ నుండి విజయవాడకు తీసుకెళ్లిన వేణు, అక్కడి నుండి అదేరోజు రాత్రి పశ్చిమ బెంగాల్ కు చెందిన ఆరుగురి కార్మికులతో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరాడు.

గురువారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కట్టంగూర్ గ్రామ శివారులోని రామాంజనేయ స్వామి ఆలయం సమీపానికి చేరుకోగానే ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వేణు కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




# హరిత ఆలోచనల ఆచరణలే మానవాళికి ఆరోగ్య సూత్రాలు

## (05 జూన్ "ప్రపంచ పర్యావరణ దినోత్సవం" సందర్భంగా)

ఐరాస నిర్వహించే అతి పెద్ద కార్యక్రమాల్లో ఒకటైన పర్యావరణ పరిరక్షణ యజ్ఞాన్ని 1973 నుంచి "యూఎన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ (ఐరాస పర్యావరణ కార్యక్రమం)"ను నిరంతరం నిర్వహించడం కొనసాగుతూ వస్తున్నది. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అజర్‌బైజాన్‌లో అధికారికంగా నిర్వహిస్తున్నారు. పర్యావరణ ఆరోగ్యమే సకల జీవకోటి సౌభాగ్యమని తెలుసుకొని మన జీవనశైలిని 'హరిత ఆలోచన'ల వైపు మళ్లిస్తేనే మనకు, భవిష్యత్తు తరాలకు ఆరోగ్య గొడుగులు పడతాయని తెలుసుకుందాం. పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా అనాలోచిత సాగు పద్ధతులు, మైనింగ్, ఆటోమొబాల్ ఉద్గారాలు, శిలాజ ఇంధనాల ఉద్గారాలు, అటవీ కార్చిచ్చులు, రేడియోధార్మిక పదార్థాలు, మురుగు నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామికీకరణ, రవాణా, పట్టణీకరణ, భూతాపం, అడవుల నరికి వేత, నిర్మాణ రంగం లాంటి అవాంఛనీయ అంశాలు నిలుస్తున్నాయి. పర్యావరణ కాలుష్యం ఫలితంగా మానవాళి/ప్రాణికోటి అనారోగ్యాలు, జీవ వైవిధ్యానికి విఘాతాలు, వాతావరణ మార్పులు, ఆర్థిక ప్రతికూలతలు, సామాజిక ప్రభావాలు లాంటి పలు దుష్ప్రభాలు కలుగుతున్నాయి. వివిధ రకాల కాలుష్యాల్లో గాలి, నేల, నీటి, శబ్ద, రేడియోధార్మిక, దుమ్ము, ఉష్ణ, విష వాయు, సముద్ర, కాంతి కాలుష్యాలు ప్రధానమైనవని మనకు తెలుసు.

### కాలుష్యానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం:

05 జూన్ 2026న ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఘనంగా నిర్వహించుకునే "ప్రపంచ పర్యావరణ దినోత్సవం (వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ డే)" నిర్వహించుకునే వేళ 2026 ఇతివృత్తంగా "ప్రకృతి స్ఫూర్తితో. వాతావరణం కోసం. మన భవిష్యత్తు కోసం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. నేల, జల కాలుష్యాలకు ప్రధాన ప్రమాదకర కారణంగా నిలుస్తున్న ప్రతికూల వాతావరణ మార్పులకు సరైన సమాధానాలు వెతకాలి. వీటిలో జీవవైవిధ్య పరిరక్షణ, సాంప్రదాయేతర శక్తి వనరుల అన్వేషణ, జీవ వ్యవస్థల పునరుజ్జీవనం లాంటివి చేయాలి. దీనికి తోడుగా ప్లాస్టిక్ కాలుష్యంతో భూమాత ఊపిరి పీల్చడం కష్టంగా తోస్తున్నది. ప్లాస్టిక్ కాలుష్య కోరల్ని పెకిలించడానికి రీయూజ్, రీసైకిల్, రెఫ్యూజ్, రెడ్యూస్, రీథింక్ అనే నినాదాలకు కార్యరూపం దాల్చడం మాత్రమే మన ముందున్న ఉత్తమ కర్తవ్యం. ప్లాస్టిక్ కాలుష్య దుష్ప్రభావంతో వాతావరణ ప్రతికూల మార్పులు, నేల/ప్రకృతి/జల/జీవ వైవిధ్య సంక్షోభాలు, వ్యర్థాల కాలుష్యం లాంటి ప్రమాదకర సమస్యలు ప్రాణికోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమాతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేడు ధరణిలో నెలకొన్న జల నెలవులు, నేలలు ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం కావడం జరుగుతోంది. నేల లేదా జలాల్లోకి చేరిన ప్లాస్టిక్ జీవ విచ్ఛిన్నం లేదా డీగ్రేడేషన్ కావడానికి వంద ఏండ్లు కూడా పట్టవచ్చని నిపుణులు హెచ్చరించడం గమనార్హం.

### మన ఏకైక భూమాతను కాపాడుకునే మార్గాలు:

ఒక పర్యావరణవేత్తకో, పర్యావరణ పరిరక్షణ సంస్థకో సంబంధించిన అంశం కాదని, ఒక రోజు మాత్రమే పాటించే విషయం కాదు ప్రపంచ పర్యావరణ దినోత్సవం అని అందరూ తెలుసుకోవాలి. మన జీవన విధానంలో ప్రతి క్షణం పర్యావరణ హితం కోరుతూ జీవన పయనం కొనసాగించాలి. పర్యావరణ కాలుష్యానికి కారణం కాకుండా చూసుకోవడంతో పాటు పౌర సమాజంలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచడం మన కనీస కర్తవ్యం. విద్యార్థులు, పాలసీ మేకర్స్, తల్లితండ్రులు, పౌర సమాజం కలిసి పర్యావరణాన్ని కాపాడే మహాయజ్ఞంలో భాగం కావాలి. మొక్కలు నాటడం, నాటిన మొక్కలను కాపాడడం, కార్చిచ్చులను నివారించడం, అడవుల నరికివేతను అరికట్టడం, వ్యర్థాలను తగ్గించడం, ప్రజలను చైతన్య పరచడం, హరిత ఆలోచనలకు రూపం ఇవ్వడం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవడం లాంటి పలు చర్యలను ప్రతి ఒక్క పౌరుడు తీసుకోవాలి.

మనదైన ఏకైక భూమాతకు హరిత చీరలు కట్టి, వాతావరణ పరిశుభ్రతను పాటించి, జల వనరులను వ్యర్థాల నుంచి రక్షించి, మన ఏకైక భూగృహాన్ని కాపాడుకుందాం. మనమనుడకు కారణమైన ధరణిని మనసుల్లో పెట్టుకొని చూసుకుందాం. మనకు మేలు చేస్తున్న పర్యావరణానికి కీడు తలపెట్టవద్దు. అన్నీ తెలుగు మన కోతిని మనమే తవ్వుకోవద్దు. మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవద్దు.



-మధుపాళీ
9949700037

# 'ఎల్ నినో' పరిస్థితి ఆందోళనకరమే అయినా.. కేంద్రం అప్రమత్తం

## ఏదిఏమైనా రైతు ప్రయోజనాలను పరిరక్షించాలి: ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్



న్యూ ఢిల్లీ, జూన్ 4:దేశవ్యాప్తంగా రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న వేళ నైరుతి రుతుపవనాల రాక, ఎల్ నినో ప్రభావం, నీటి లభ్యత, విత్తన సరఫరా ఏర్పాట్లు, పంటల ప్రణాళిక, వివిధ రాష్ట్రాల సన్నద్ధత స్థాయి తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా వ్యవసాయ-రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు న్యూఢిల్లీలోని కృషి భవన్‌లో సవివర, సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ కీలక ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ- సంబంధిత కేంద్ర శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిబద్ధతతో, మెరుగైన సమన్వయంతో, సరైన ప్రణాళికలతో ముందడుగు వేయాలని ఈ సందర్భంగా స్పష్టమైన సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా రైతులకు సకాలంలో సలహాలు, అనువైన విత్తనాల సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, తేమ పరిరక్షణకు తోడ్పాటు, సముచిత జల నిర్వహణ తదితరాల్లో సహాయం అందేలా చూడటమే లక్ష్యం కావాలని చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో ప్రభుత్వం పూర్తి అప్రమత్తతతో, అన్నిరకాల సన్నాహాలు చేస్తోందని తెలిపారు. కాబట్టి, రైతులు ఎంతమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. పొలాలు, రైతులపై వాతావరణ సంబంధిత సవాళ్ల ప్రభావం వీలైనంత తక్కువగా ఉండేలా చూడటం ప్రధానమన్నారు.

ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా రైతు ప్రయోజనాలే అత్యంత ప్రధానంగా పరిగణించాలని చెప్పారు. ఎల్ నినో వల్ల సంభవించే విపరిణామాలను దృష్టిలో ఉంచుకుని, అవసరమైన అన్ని సన్నాహాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. వాతావరణ సూచనలు, నీటి లభ్యత, పంటల ప్రస్తుత పరిస్థితి, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పాదకాల సరఫరా ఏర్పాట్లు, రాష్ట్రాల సన్నద్ధత, ఇతరత్రా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే దిశగా కార్యాచరణ ప్రణాళికలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించారు.

ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో వర్షపాతం సాధారణంకన్నా తక్కువగా ఉండవచ్చునని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సూచించినట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా కాలానుగుణ వర్షపాతం దీర్ఘకాల సగటులో సుమారు 90 శాతంగా ఉంటుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. రుతుపవన సమయంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడవచ్చని కూడా ఐఎండీ తెలిపిందని వెల్లడించారు. తదనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తన సన్నాహాలను ముమ్మరం చేసిందని, అన్ని రాష్ట్రాలూ అప్రమత్తంగా ఉండాలని సూచించిందని పేర్కొన్నారు. వాతావరణ శాఖ సూచనలను పూర్తి స్థాయిలో పరిగణనలోకి తీసుకుంటున్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, మెరుగైన నీటి నిర్వహణ పద్ధతులు, అధునాతన సాంకేతికత వినియోగం, సాగునీటి సౌకర్యాల విస్తరణ, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతుల అనుసరణ ద్వారా సంభావ్య సవాళ్ల ప్రభావాన్ని చాలావరకూ నియంత్రించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

దేశంలోని జలాశయాలలో నీటి మట్టం ప్రస్తుతానికి సంతృప్తికరంగా ఉన్నదని అధికారులు పేర్కొనడం ఈ సమావేశంలో వెల్లడైన ఓ కీలక, సానుకూలాంశం. మొత్తం మీద నీటి నిల్వల పరిస్థితి సాధారణ స్థాయి కన్నా మెరుగ్గా ఉంది. అందుబాటులో గల తాజా అంచనాల ప్రకారం- నిరుడు ఇదే సమయానికి గల సాధారణ నిల్వకన్నా 127.01 శాతం అధికంగా ఉంది. అందువల్ల ఖరీఫ్ సాగులో నీటి అవసరాలు తీర్చడానికి ఈ నిల్వలు గణనీయంగా తోడ్పడటమేగాక పొలాల్లో తేమ కొరత ముప్పును నివారించే వీలుంటుంది.

అధికారులు ఈ వివరాలను వెల్లడించిన అనంతరం శ్రీ శివరాజ్ చౌహాన్ స్పందిస్తూ- ప్రస్తుత సవాలు వర్షపాత అంచనాలకు మాత్రమే సంబంధించినది కాదని, క్షేత్రస్థాయి సన్నాహాలపైనా దృష్టి సారించాలని సూచించారు. తక్కువ వర్షపాతం, సుదీర్ఘ పొడి వాతావరణం లేదా ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం గల రాష్ట్రాలు, జిల్లాల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ, నిరంతర సమీక్ష, తక్షణ చర్యలు అవశ్యమని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయి వరకూ తక్షణ ప్రణాళికలను కాగితాలకు పరిమితం చేయకుండా తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు, అందుబాటులో గల నీటి వనరులు, ప్రస్తుత పంటల సరళి, విత్తనాల లభ్యత స్థితి, నాట్ల పురోగమనం, వర్షపాత విరామాలు, జిల్లావారీగా తలెత్తే ప్రమాదాలను జాగ్రత్తగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వీటన్నిటి తర్వాతే తగిన ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాలని చెప్పారు. రైతుకు ఆచరణాత్మక, సకాల పరిష్కారం చూపడంలో ఈ చర్యలు తోడ్పడతాయని తెలిపారు.

ప్రాంతీయ, పంటల వారీ వ్యూహాల అనుసరణపై కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారిస్తున్నదని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ పంటలు, ఆలస్యంగా నాట్లు వేసే ప్రణాళిక, కరవును తట్టుకోగల వంగడాల సరఫరా వంటి తక్షణ, సమర్థ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రణాళిక దిశగా రైతులను ప్రోత్సహిస్తూ సకాలంలో సలహాలు, విత్తనాలు, అవసరమైన వనరులు, తగిన అవకాశాలపై సన్నద్ధం చేయాలని ఆయన సూచించారు.

విత్తన లభ్యత గురించి అధికారులు వివరిస్తూ- ఖరీఫ్, రబీ... రెండు సీజన్లకూ అవసరమైన దానికి మించి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనా నిభాయించగలిగేలా జాతీయ విత్తన నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఏదైనా నిర్దిష్ట ప్రాంతంలో ప్రతికూల వాతావరణ ప్రభావం ఎదురైతే, రైతులకు తక్షణం సముచిత వంగడాలతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందించడమే ఈ సన్నాహాల ముఖ్యోద్దేశమని వారు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ స్పందిస్తూ- విత్తన లభ్యతకు మాత్రమే పరిమితం కారాదని, వాటి నాణ్యతపైనా శ్రద్ధ వహించాలని ప్రత్యేకంగా ఆదేశించారు. నాసిరకం లేదా బలహీనంగా ఉండే విత్తనాలతో సాగు చేపడితే తక్కువ వర్షపాతం వల్ల కలిగే ప్రతికూల ప్రభావం మరింత తీవ్రం కాగలదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ధ్రువీకృత, అనువైన, ఉపయుక్త విత్తనాలు మాత్రమే రైతుకు చేరేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలపై ఉందని స్పష్టం చేశారు. అవసరమైనప్పుడు తిరిగి విత్తుకోవడానికి వీలుగా, స్వల్పకాలిక, తక్కువ నీటి వినియోగంతో ఫలసాయమిచ్చే విత్తనాలను కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

వ్యవసాయ రంగానికి తోడ్పాటులో గ్రామీణాభివృద్ధి యంత్రాంగం, సంబంధిత సంస్థలు పోషిస్తున్న కీలక పాత్రను శ్రీ చౌహాన్ ప్రముఖంగా ప్రస్తావించారు. పొలాల్లో తేమను నిలపడం, జల సంరక్షణ, నీటి నిల్వ, వ్యవసాయ చెరువుల తవ్వకం, స్థానిక జలసంరక్షణ కట్టడాల బలోపేతం, అందుబాటులో గల అన్ని వనరుల గరిష్ఠ వినియోగం తదితరాలపై తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అంచనాలకన్నా తక్కు వర్షపాతం నమోదైనా తేమ సంరక్షణ, శాస్త్రీయ నీటి నిర్వహణ వంటి సమర్థ చర్యల ద్వారా పంటలను చాలావరకూ కాపాడుకోవచ్చునని ఆయన తెలిపారు.

జలాశయాల నీటి వాడకంపై శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ- నీరు అందుబాటులో ఉన్న చోటల్లా శాస్త్రీయంగా, సమతౌల్యంతో, సముచిత ప్రాధాన్యం ప్రాతిపదికగా వినియోగించుకోవాల్సి ఉందన్నారు. కాలువ వ్యవస్థల చివరి అంచె దాకా నీరు వాస్తవంగా చేరుతున్నదీ లేనిదీ తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అలాగే, కమాండ్ ఏరియాలలో నీటి వినియోగం తీరు, పరిమిత నీటి లభ్యతతో గరిష్ఠంగా పంటల సాగు, అత్యధిక సంఖ్యలో రైతులకు రక్షణ వంటి అంశాలపై రాష్ట్రాలకు విస్పష్ట సలహాలివ్వాలని ఆయన ఆదేశించారు.

రుతుపవనాల సమయంలో రెండు, మూడు లేదా నాలుగు వారాల పాటు వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా తదనుగుణంగా అనుసరించగల విస్పష్ట, సంసిద్ధ వ్యూహం ఉండాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితులలో తిరిగి నాట్లు వేయడానికి సంబంధించి ప్రణాళికలు, పంటల రక్షక నీటిపారుదల, స్వల్పకాలిక పంటల సాగు, ప్రత్యామ్నాయ విత్తన వ్యూహాల అమలు సహా జిల్లాలావారీగా సముచిత సలహాలు ఇవ్వడంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పంటలకు చీడపీడల నివారణపై చర్చకు ఈ సమావేశం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. వాతావరణ మార్పులు, తేమలో అసమతౌల్యం లేదా వర్షపాత విరామాల వల్ల ఎలాంటి వ్యాధులు, తెగుళ్లు పంటలను ఆశిస్తాయో ముందే గుర్తించాలని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. సముచిత పర్యవేక్షణ వ్యవస్థలు, నివారణ సంబంధిత సలహాలను ముందుగానే సిద్ధం చేసి రాష్ట్రాలకు, రైతులకు వేగంగా చేరేలా చూడాలని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వానికి నేడు విస్తృత సమాచారం, సమర్థ సాంకేతిక వేదికలు-సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. అందువల్ల, మొబైల్ సందేశాలు, సలహాలు, హెచ్చరికలు, పంట సంబంధిత సమాచారం నేరుగా రైతులకు అందించే ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి యంత్రాంగాలు, కాల్ సెంటర్లు, స్థానిక అధికారులు, వివిధ డిజిటల్ మాధ్యమాల సముచిత అనుసంధానం ద్వారా సరైన సమయంలో రైతుకు సముచిత సలహాలు లభించేలా పటిష్ఠ వ్యవస్థను రూపొందించాలని ఆయన సూచించారు.

కేంద్ర స్థాయిలోనే కాకుండా రాష్ట్రాల పరంగానూ సన్నద్ధతను నిరంతరం సమీక్షించాలని ఆయన అన్నారు. ఈ మేరకు ఏయే రాష్ట్రాలు మెరుగైన సన్నద్ధతతో పురోగమిస్తున్నాయి.. ఏయే రాష్ట్రాలకు కేంద్రం నుంచి అదనపు మద్దతు, జోక్యం లేదా మార్గదర్శకత్వం అవసరం తదితర అంశాలపై అప్రమత్తత అవసరమని నిర్దేశించారు. స్పందన మందగించిన పక్షంలో లేదా సన్నద్ధత స్థాయి సాపేక్షంగా బలహీనంగా ఉన్న చోట కేంద్ర ప్రభుత్వం చురుకైన సమన్వయం, మద్దతుతో పరిస్థితిని చక్కదిద్దడానికి కృషి చేయాలని తెలిపారు.

వ్యవసాయంతో ముడిపడిన వివిధ మంత్రిత్వ శాఖలు వేటికవిగా కాకుండా పనిచేయడం కాకుండా సమాచార ఆదానప్రదానం, సంయుక్త సమీక్ష, సమీకృత వ్యూహంతో కృషి చేయాలని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ సమావేశంలో పాల్గొన్న వారందరికీ స్పష్టం చేశారు. వాతావరణం, నీరు, విత్తనాలు, పంటలు, తెగుళ్ల నివారణ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి సంబంధిత అంశాలన్నిటినీ జోడించినపుడే జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సమర్థ చర్యలు చేపట్టే వీలుంటుందని ఆయన చెప్పారు.

రాబోయే కష్టనష్టాల అంచనా, నివారణ మాత్రమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కాదని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు. రైతుల విశ్వాసం సడలకుండా, వ్యవసాయ కార్యకలాపాలకు అంతరాయం లేకుండా ఖరీఫ్ పంటల కాలం సజావుగా, విజయవంతంగా ముగిసేలా సకాలంలో అన్నిరకాల చర్యలూ తీసుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మెరుగైన జల నిర్వహణ పద్ధతులు, సాంకేతిక పురోగమనం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సకాలంలో నాణ్యమైన విత్తన లభ్యత, ప్రత్యామ్నాయ వ్యూహాలు, భాగస్వామ్య వ్యవస్థలన్నిటి మధ్య బలమైన సమన్వయం ద్వారా ఎలాంటి సవాళ్ల ప్రభావాన్నైనా గణనీయంగా తగ్గించవచ్చునని స్పష్టం చేశారు.

# ఎన్డీఏ కార్యాలయంలో పదో రోజు ప్రజా దర్బార్‌కు విశేష స్పందన




అమరావతి, జూన్ 4:కష్టాల్లో ఉన్నవారికి పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం అండగా నిలుస్తుంది. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో పదో రోజు నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించింది వివిధ సమస్యలపై ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివచ్చిన ప్రజలు, కూటమి కార్యకర్తల నుంచి ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, 44 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, 39 వ డివిజన్ జనసేన అధ్యక్షుడు ఏలూరు సాయి శరత్, 43 వ డివిజన్ జనసేన అధ్యక్షుడు బొల్లేపల్లి కోటేశ్వరరావు, బీజేపీ సీనియర్ నాయకులు దుర్బేసుల హుస్సేన్, డాక్టర్ హనుమంతరావు, పోలవరపు దుర్గారావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. సామాజిక పెన్షన్లు, ఇళ్ళ రిజిస్ట్రేషన్లు, నూతన ఇంటికొరకు దరఖాస్తులు, తాగునీటి ఇబ్బందులు ,వైద్యం సాయం తదితర అంశాలపై వినతులు అందాయని కూటమి నేతలు పేర్కొన్నారు.. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతున్నారు

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం బీజేపీ మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ బీజేపీ మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారికి మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ బొడ్డుపల్లి శ్రీనివాసరావు పశ్చిమ నియోజకవర్గం లోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి నిరంతరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్ లను నిర్వహిస్తున్నారని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు కోరారు..

# గగనతలం నుంచి భూతలానికి ప్రయోగించే 'రుద్రమ్-II క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీఓ, భారత వాయుసేన

న్యూ ఢిల్లీ, జూన్ 4:డీఆర్‌డీఓ (రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ), భారత వాయుసేన కలిసి గగనతలం నుంచి భూతలానికి ప్రయోగించే 'రుద్రమ్-ఎఎ' క్షిపణిని యుద్ధ విమానం ద్వారా విజయవంతంగా పరీక్షించాయి. అత్యంత కఠినమైన క్షిపణి గమన మార్గంతో నిర్వహించిన ఈ పరీక్షల్లో అన్ని ఉప-వ్యవస్థల సామర్థ్యం విజయవంతంగా నిరూపితమైంది.

యుద్ధ విమానం నుంచి విడివడిన తర్వాత ఈ క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో ముందుగా నిర్ణయించిన లక్ష్యం వైపు దూసుకెళ్లాయి. చండీపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో (ఐటీఆర్) మోహరించిన వివిధ రేంజ్ పరికరాల ద్వారా సేకరించిన ఫ్లైట్ డేటా ఆధారంగా లక్ష్యాలన్నింటినీ ఈ పరీక్ష పూర్తిగా సాధించినట్లు నిర్ధారించారు.

ఈ క్షిపణి విషయంలో నోడల్ ల్యాబొరేటరీగా వ్యవహరించిన హైదరాబాద్‌లోని 'రిసెర్చ్ సెంటర్ ఇమారత్' (ఆర్‌సీఐ).. డీఆర్‌డీఓకి చెందిన ఇతర పరిశోధనా సంస్థలైన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్‌డీఎల్), హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ (హెచ్ఈ ఎంఆర్ఎల్), ఆర్మమెంట్ రీసెర్చ్ - డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ), ఐటీఆర్‌ల సహకారంతో ఈ 'రుద్రమ్-ఎఎ' క్షిపణిని పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. డీసీపీపీలతో (డెవలప్‌మెంట్ కమ్ ప్రొడక్షన్ పార్ట్‌నర్స్) పాటు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రీజినల్ సెంటర్ ఫర్ మిలిటరీ ఎయిర్‌వర్దినెస్ (ఆర్‌సీఏఎ), మిస్సైల్ సిస్టమ్ క్వాలిటీ అష్యూరెన్స్ ఏజెన్సీ (ఎంఎస్‌క్యూఏఏ) వంటి ప్రభుత్వ సంస్థలు, అనేక ఇతర ప్రైవేట్ పరిశ్రమలు ఈ క్షిపణి విషయంలో గణనీయమైన సహకారాన్ని అందించాయి.

ఈ క్షిపణి పరీక్ష విజయవంతమవటం పట్ల రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ, భారత వాయుసేన (ఐఏఎఫ్), డిఫెన్స్ పీఎస్‌యూలు (డీపీఎస్‌యూ), డీసీపీపీలు, రక్షణ రంగ పరిశ్రమల కృషిని ఆయన కొనియాడారు. ఈ పరీక్షలు పెరుగుతున్న స్వదేశీ రక్షణ సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని.. అత్యాధునిక ఆయుధ వ్యవస్థల్లో భారత్‌ను ఆత్మనిర్భరత వైపు నడిపించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ విజయాన్ని సాధించడంలో భాగస్వాములైన అన్ని బృందాలకు రక్షణ పరిశోధన-అభివృద్ధి శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ చైర్మన్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# "రా వాటర్ పంపింగ్" పనుల పర్యవేక్షణ..

అమరావతి,జూన్ 4:సత్తెనపల్లి పురపాలక సంఘం పరిధిలో కొనసాగుతున్న మేజర్, మీడియం డ్రైన్ల పూడికతీత పనులతో పాటు గార్లపాడు రోడ్డులో వున్న పురపాలకసంఘ రక్షిత మంచినీటి సరఫరా చెరువుకు, ఆయిల్ ఇంజన్ల ద్వారా చేపడుతున్న రా వాటర్ పంపింగ్ పనులను గురువారం సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, ప్రత్యేక అధికారి కె. శ్రీరాములు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైన్లలో పూడిక తొలగింపు పనుల పురోగతిని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న ముందస్తు చర్యలను ఆయన సమీక్షించారు.అలాగే పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందించేందుకు రక్షిత మంచినీటి చెరువుకు నిర్వహిస్తున్న రా వాటర్ పంపింగ్ ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్. ఆనందకుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. మధుసూధ నరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ పార్థసారథి, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా సక్రమంగా కొనసాగేందుకు పురపాలక సంఘం అవసరమైన చర్యలు చేపడుతోందని కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ తెలిపారు.

# నిత్య అన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళం

## -ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)కి చెక్కు అందించిన దాతలు



విజయవాడ, జూన్ 4: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కదుర్గమ్మ అమ్మవారి నిత్య అన్నదాన విభాగానికి భక్తులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. పటమటలంకకు చెందిన తోట మల్లికార్జునరావు?మల్లేశ్వరి దంపతులు అమ్మవారిపై ఉన్న అపార భక్తిశ్రద్ధలతో రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు.

ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో దాతలు తమ విరాళాన్ని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)కు అందజేశారు. ఆలయ అధికారులు దాతకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయక వేద ఆశీర్వచనం అనంతరం దుర్గగుడి చైర్మన్ బొర్రా గాంధీ అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు రసీదును అందజేశారు.

# కోటి మందికి పైగా వినియోగదారులతో భారత ప్రభుత్వ డిజిటల్ మీడియా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్న 'వేవ్స్ ఓటీటీ'

న్యూఢిల్లీ, జూన్ 4 ప్రసార భారతి పరిధిలోని డిజిటల్ స్ట్రీమింగ్ వేదిక 'వేవ్స్ ఓటీటీ' కోటి మందికి పైగా నవమోదిత వినియోగదారులతో ముందుకు దూసుకెళ్తోంది. ఈ వేదిక 2024 నవంబరులో ప్రారంభం కాగా, కేవలం రెండేళ్లలోపే ఈ ఘనతను సాధించడం విశేషం.

భారత సార్వజనీన డిజిటల్ మీడియా వ్యవస్థ వృద్ధిలో ఈ విజయం ఓ కీలక మలుపును సూచిస్తోంది. అంతేకాకుండా జాతీయ, అంతర్జాతీయ ప్రేక్షకులకు విశ్వసనీయ, సమ్మిళిత, వైవిధ్యభరిత కంటెంట్‌ను అందించే స్వదేశీ డిజిటల్ వేదికలకు పెరుగుతున్న ఆదరణను కూడా ప్రతిబింబిస్తుంది.

'వేవ్స్ ఓటీటీ'పై నేడు వినోదం, వార్తలు, విద్య, సంస్కృతి, ఆధ్యాత్మికత, ప్రభుత్వ సేవలు వంటి వివిధ విభాగాల్లో 24,000కు పైగా కంటెంట్ టైటిల్స్ సహా 15,000 గంటలకు పైగా కంటెంట్‌ను అందిస్తోంది. ఈ వేదికపై 140కి పైగా ప్రత్యక్ష ప్రసార టీవీ ఛానెళ్లు, 200కు పైగా రేడియో సేవలు, లైవ్ ఈవెంట్ స్ట్రీమింగ్, పీఎం ఈవిద్యా చానెళ్ల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్, యోజన, కురుక్షేత్ర, రోజ్‌గార్ సమాచార్ డిజిటల్ ఎడిషన్లు, ప్రముఖ ఆలయాల నుంచి భక్తి ప్రసారాలు సహా ప్రసార భారతి నుంచి వేలాది గంటల భాండాగార కంటెంట్‌ను కూడా ప్రేక్షకులకు అందిస్తోంది.

మొబైల్, వెబ్ సహా సంధానిత టీవీల ద్వారా అందుబాటులోగల 'వేవ్స్ ఓటీటీ' ప్రస్తుతం 130కి పైగా దేశాల్లోని ప్రేక్షకులకు చేరువైంది. అనేక భారతీయ భాషలలో కంటెంట్‌ను అందిస్తూ, విస్తృత శ్రేణి ప్రజాహిత, వినోద కార్యక్రమాలను ఉచితంగా అందిస్తోంది.'వేవ్స్ ఓటీటీ' వేదిక కోటిమంది వినియోగదారుల స్థాయిని అధిగమించడంపై ప్రసార భారతి స్పందిస్తూ- "డిజిటల్ యుగంలో డిజిటల్ ప్రభుత్వ సేవా మాధ్యమాలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఈ విజయం ప్రతిబింబిస్తుంది. అలాగే టెలివిజన్, రేడియో, ఆన్-డిమాండ్ కంటెంట్, విద్య, సంస్కృతి, వారసత్వాల దిశగా ఒకే గమ్యాన్ని సృష్టించే దార్శనికత సాకారానికి ఇది భరోసా ఇస్తుంది" అని పేర్కొంది.

కంటెంట్ ప్రసారాల నిరంతర విస్తరణ, వ్యూహాత్మక డిజిటల్ భాగస్వామ్యాలు, విస్తృత ఉపకరణాల ద్వారా లభ్యత, మెరుగైన వినియోగదారు అనుభవం తదితరాలతో ఈ వేదిక నిలకడగా వృద్ధి పథంలో సాగుతోంది. భక్తి కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారం, విద్యా సంబంధ కంటెంట్, డిజిటల్ ప్రచురణలు, ఆర్కైవల్ సేకరణలు, ప్రత్యక్ష ఈవెంట్ కవరేజ్ వంటి ఇటీవలి అదనపు హంగులు 'వేవ్స్ ఓటీటీ' ప్రేక్షక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశాయి.

ఈ మేరకు కోటి మందికి పైగా నవమోదిత వినియోగదారులు, 1.4 కోట్లకు పైగా డౌన్‌లోడ్‌లతో 'వేవ్స్ ఓటీటీ' ఇప్పుడు తదుపరి దశ వృద్ధిపై దృష్టి సారించింది. కంటెంట్ భాగస్వామ్యాల విస్తరణ, వివిధ ఉపకరణాలు-వేదికల ద్వారా విస్తృత పంపిణీ, ప్రాంతీయ, విద్యా సంబంధిత కంటెంట్ బలోపేతం సహా 2027 మార్చి నాటికి నమోదిత వినియోగదారుల సంఖ్యను 2 కోట్లకు చేర్చడం వంటి లక్ష్యాలు ఇందులో భాగంగా ఉన్నాయి.

దేశంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న ప్రభుత్వ సేవా స్ట్రీమింగ్ వేదికగా భారతీయ సంస్కృతి, జ్ఞానం, వారసత్వం, సృజనాత్మకతల డిజిటల్ ప్రదర్శన వేదికగా 'వేవ్స్ ఓటీటీ' స్థానాన్ని ప్రస్తుత విజయం మరింత బలోపేతం చేస్తుంది.

# ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ కోసం మహారాష్ట్రలో 3వ పర్వత సొరంగ నిర్మాణం పూర్తి

న్యూ ఢిల్లీ, జూన్ 4:ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులలో ఓ ప్రధాన ఇంజనీరింగ్ విజయం నమోదైంది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా, దహను తాలూకా పరిధిలోగల అంబేసరి గ్రామం మీదుగా సాగే ఈ మార్గంలో 3వ పర్వత సొరంగ (ఎంటీ-07) నిర్మాణం పూర్తయింది.

భారత తొలి హై స్పీడ్ రైలు కారిడార్‌లో సాంకేతికంగా అత్యంత సవాలుతో కూడిన విభాగాలలో ఒకటైన ఈ ప్రాజెక్టు పనుల పురోగమన వేగాన్ని తాజా విజయం ప్రతిబింబించింది. తద్వారా 5 నెలల వ్యవధిలోనే మహారాష్ట్ర పరిధిలో 3 సొరంగాల తవ్వకం పూర్తి కావడం విశేషం.

ప్రస్తుతం పూర్తిచేసిన ఎంటీ-07 పర్వత సొరంగం పొడవు 417 మీటర్లు కాగా, వెడల్పు 14.4 మీటర్లు. బుల్లెట్ రైలు కారిడార్‌లోని అప్-డౌన్ ట్రాక్‌లకు అనువుగా దీనికి రూపమిచ్చారు. అత్యాధునిక ఇంజనీరింగ్, భద్రత విధానాల తోడ్పాటుతో నియంత్రిత తవ్వకం-పేలుడు (డ్రిల్లింగ్-బ్లాస్టింగ్) విధానంలో సొరంగాన్ని రెండు వైపుల నుంచి తవ్వుతూ వచ్చారు.

ఈ ప్రక్రియలో ఆసాంతం నిర్మాణ స్థిరత్వం, కార్మిక భద్రత, నిర్దిష్ట పనితీరు దిశగా అత్యాధునిక పర్యవేక్షణ వ్యవస్థలు, జియోటెక్నికల్ పరికరాలను వినియోగించారు. "సర్ఫేస్ సెటిల్‌మెంట్ పాయింట్స్, త్రీడీ టార్గెట్లు, స్ట్రెయిన్ గేజ్‌లు, సీస్మోగ్రాఫ్" వంటి వాటితో ప్రత్యక్ష పర్యవేక్షణతో కూడిన ప్రకంపనల పద్ధతి, సొరంగం తీరు, పరిసర నిర్మాణాలను నిరంతరం పరిశీలిస్తూ వచ్చారు. తవ్వకం పనుల సమయంలో వెంటిలేషన్ వ్యవస్థలు, అగ్నిమాపక భద్రత ఏర్పాట్లు, నియంత్రిత ప్రవేశం, నిరంతర జియోటెక్నికల్ పర్యవేక్షణ సహా కార్మికుల సమగ్ర భద్రతకు తగిన చర్యలు తీసుకున్నారు.

మహారాష్ట్రలో మునుపటి సొరంగాల తవ్వకం విజయాలు

ఈ మార్గంలోని మహారాష్ట్ర విభాగంలో తాజా ఘనత మునుపటి విజయాలకు కొనసాగింపుగా నిలిచింది. ఈ నేపథ్యంలో 1.5 కిలోమీటర్ల పొడవైన మొదటి సొరంగం (ఎంటీ-05) నిర్మాణం పాల్ఘర్ జిల్లాలోని సఫాలే సమీపాన ఈ ఏడాది జనవరి 2నాటికి పూర్తయింది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ సంబంధిత తొలి విజయవంతమైన సొరంగ నిర్మాణంగా ఇది పరిగణనలోకి వచ్చింది. ఆ తర్వాత 'న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ మెథడ్' (ఎన్ఏటీఎం) ద్వారా 454 మీటర్ల పొడవైన రెండో సొరంగం (ఎంటీ-06) తవ్వకాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 3న పూర్తిచేశారు. అంటే- కేవలం నెల వ్యవధిలోనే పాల్ఘర్ జిల్లాలో రెండు విజయాలను సాధించారు.

మహారాష్ట్రలో ప్రస్తుతం 7 సొరంగాలను తవ్వుతుండగా, వీటిలో 'ఎంటీ-05, 06, 07' ఇప్పుడు పూర్తయ్యాయి. అయితే, 2023 అక్టోబరు 5 నాటికి ఎంటీ-08 (350 మీటర్లు) పూర్తికాగా, 'ఎంటీ-03' పనులు 80 శాతం దాకా అధిగమించాయి. ఇక 'ఎంటీ-04' దాదాపు 60 శాతం పూర్తికాగా, 'ఎంటీ-01, 02' సొరంగాల పనులు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. మొత్తంమీద ముంబయి?అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు మార్గంలో 8 పర్వత సొరంగాలకుగాను మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లా పరిధిలో 7, గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ జిల్లాలో ఒకటి ఉన్నాయి.

మరోవైపు వాపి, బోయిసర్ బుల్లెట్ రైలు స్టేషన్ల మధ్యగల 3 సొరంగాలు విజయవంతంగా పూర్తయ్యాయి. ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు మార్గం మహారాష్ట్రలోని బోయిసర్, గుజరాత్‌లోని వాపి మధ్యగల కీలక పారిశ్రామిక ప్రాంతం మీదుగా వెళ్తుంది.

# యువసంగమ్ ఆరో దశ కింద మేఘాలయ విద్యార్థి ప్రతినిధి బృందంతో సంభాషించిన తెలంగాణ గవర్నర్

న్యూ ఢిల్లీ, జూన్ 4:మేఘాలయ విద్యార్థి ప్రతినిధి బృందంతో 2026 మే 28న హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సమావేశమయ్యారు.

యువతలో జాతీయ సమైక్యతను, విభిన్న సంస్కృతుల అవగాహనను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన విద్యా - సాంస్కృతిక వినిమయ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-షిల్లాంగ్ నేతృత్వంలోని విద్యార్థి ప్రతినిధి బృందం తెలంగాణలో పర్యటిస్తోంది.

అంతకుముందు మే 25న.. ఈ పర్యటనకు ఆతిథ్య సంస్థ అయిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - వరంగల్‌లో ఈ విద్యార్థుల ప్రతినిధి బృందానికి ఘనస్వాగతం లభించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వారి సమగ్ర అవగాహన, సాంస్కృతిక అధ్యయన ప్రయాణం ప్రారంభమైంది.

జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడంలో, దేశ నిర్మాణానికి దోహదపడడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని ఈ సమావేశంలో గవర్నర్ వివరించారు. ఈ సందర్భంగా యువసంగమ్ యాత్ర అనుభవాలను పంచుకున్న ప్రతినిధులు.. గౌరవ సూచకంగా గవర్నర్‌కు ఒక జ్ఞాపికను బహూకరించారు. దేశ వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువలు, ఐక్యతా స్ఫూర్తిపై విద్యార్థుల అవగాహనను ఈ సమావేశం మరింత మెరుగుపరిచింది.

హుస్సేన్ సాగర్, సమతా మూర్తి, రామప్ప ఆలయం, వరంగల్ కోట, భద్రకాళి ఆలయం, వెయ్యి స్తంభాల గుడి వంటి ప్రసిద్ధ చారిత్రక ప్రదేశాలతోపాటు సాంస్కృతిక, విద్యా, ఆవిష్కరణ కేంద్రాలను విద్యార్థి ప్రతినిధి బృందం సందర్శించింది. సుసంపన్నమైన తెలంగాణ వారసత్వం, సాంస్కృతిక పరంపర, విద్యా నైపుణ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై విలువైన సమాచారాన్ని వారు తెలుసుకున్నారు. కన్హా శాంతి వనం, టి-హబ్‌లను కూడా సందర్శించి.. సంపూర్ణ ఆరోగ్య పద్ధతులతోపాటు దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఆవిష్కరణ, అంకుర సంస్థల గురించిన విశేషాలను తెలుసుకున్నారు.

ఎన్ఐటీ- వరంగల్‌లో పరిశోధన - ఆవిష్కరణ కేంద్రాలను వారు పరిశీలించారు. పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించే మొక్కల పెంపకం కార్యక్రమంలో పాల్గొన్నారు. యువసంగమ్ ప్రయాణంలో వారి అభ్యసనానుభవాలు, సాంస్కృతిక అధ్యయన కార్యక్రమాన్ని ముగిస్తూ.. 2026 మే 30న వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 మే 31న విద్యార్థి ప్రతినిధి బృందం మేఘాలయకు బయలుదేరింది.

విద్యా మంత్రిత్వశాఖ పరిధిలోని ఉన్నత విద్యాశాఖ యువసంగమ్ ఆరో దశ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సమగ్ర విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా జాతీయ సమైక్యతను బలోపేతం చేయడం, సాంస్కృతిక సామరస్యం, భావోద్వేగాల ఏకీకరణ దీని ప్రధాన లక్ష్యాలు.

ఈ కార్యక్రమం 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులను ఒకచోట చేర్చి.. భారత్ వైవిధ్యం, ఆవిష్కరణ వ్యవస్థలు, దేశ నిర్మాణానికి సంబంధించి సమష్టి ఆకాంక్షల దిశగా విస్తృతమైన అవగాహన మార్గాలను అందిస్తుంది.

# ఎస్ఎన్ఎంసి ఉర్దూ గర్ల్స్ హైస్కూల్లో పిల్లలను చేర్పించండి

## హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి. రత్నకుమారి ఆధ్వర్యంలో ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ ర్యాలీ




అమరావతి, జూన్ 4:చక్కటి విద్యా బోధన కోసం పిల్లలను వించిపేటలోని ఎస్ ఎన్ ఎం సి ఉర్దూ గర్ల్స్ హై స్కూల్ లో చేర్పించాలని కోరుతూ ౦ ఎ ౖ ా న ్ ా ౖ ల ్ ప్రధానోపాధ్యాయురాలు డి. రత్నకుమారి ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు వించిపేటలోని పలు ప్రాంతాల్లో ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి మాట్లాడుతూ తమ పాఠశాలలో, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ మండుటెండల్లో సైతం తమ ఉపాధ్యాయ బృందంతో ఇంటింటికి తిరుగుతూ ఈ ప్రత్యేక ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు.

ఉర్దూ ఇంగ్లీష్ మీడియంలలో వేరువేరుగా ప్రతి సబ్జెక్టులో ఉపాధ్యాయులను కేటాయించడం జరిగిందని చెప్పారు. ఇటీవలి టెన్త్ పరీక్షల్లో తమ విద్యార్థులు 81% ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. టెన్త్ పరీక్షల్లో 600 మార్కులకు గాను అబ్దుల్ అలియా 556 మార్కులు, రబియా షరీఫ్ 549 మార్కులు, ఎండి హజర 548 మార్కులు, దిబియా 534 మార్కులు, ఎండి సఫా బేగం 518 మార్కులు, షాదియ ఆఫ్రిన్ 504 మార్కులు సాధించారని ఆమె వివరించారు.

తమ పాఠశాలలో చేరిన ప్రతి బిడ్డకు తల్లికి వందనం 15 వేల రూపాయలు ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు.

అలాగే పిల్లల చదువుకు ఎటువంటి ఫీజులు లేవన్నారు. స్కూల్ బ్యాగ్ ఉచితంగా ఇస్తామని, మూడు జతల యూనిఫామ్ ఉచితమని, అలాగే షూస్ ఉచితమని, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ ఉచితంగా అందజేస్తామని చెప్పారు. అలాగే ఎస్ ఎన్ ఎం సి మోడల్ ప్రైమరీ స్కూల్లో ప్రైమరీ విద్యార్థులను చేర్పించాలని ఆమె కోరారు. ఈ ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ ర్యాలీలో హైస్కూల్ ఉపాధ్యాయులు నస్రిన్ జహాన్, పి. వెంకట సుబ్బారావు, జి. శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా, ఇస్రాత్ బేగం, పర్వీన్ సుల్తానా, ఎస్ ఎన్ ఎం సి మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఎండి. గౌసియా సుల్తాన్, టీచర్ రసీలా రబాబ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుభాషా కృత్రిమ మేధ పరిష్కారాల అభివృద్ధికి సంయుక్తంగా వ్యోమా ఇన్నోవేషన్ ఛాలెంజ్ ను ప్రారంభించిన డిజిటల్ ఇండియా భాషిణి విభాగం, కరెంట్ ఏఐ, కల్పా ఇంపాక్ట్

న్యూఢిల్లీ, జూన్ 4:ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ కరెంట్ ఏఐ, కల్ప ఇంపాక్ట్ తో కలసి వ్యోమ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ను ప్రారంభించింది. ఈ వినూత్న కార్యక్రమం ఆఫ్‌లైన్, తక్కువ ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో కూడా పనిచేయగల ఓపెన్ - సోర్స్, బహుభాషా, వాయిస్ - ఫస్ట్ కృత్రిమ మేధ పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026లో భాషిణి, కరెంట్ ఏఐ సంయుక్తంగా ఆవిష్కరించిన 'సునో సూత్ర' ఆధారంగా ఈ ఛాలెంజ్ ను రూపొందించారు. బహుభాషా, వాయిస్ - ఫస్ట్, ఓపెన్ - సోర్స్ హ్యాండ్‌హెల్డ్ ఏఐ రిఫరెన్స్ పరికరంగా 'సునో సూత్ర' ను రూపొందించారు. ప్రాథమిక నమూనాగా రూపొందించిన ఈ పరికరం బహుభాషా సాంకేతికతలను ఆన్ డివైజ్ ఏఐ సామర్థ్యాలతో అనుసంధానిస్తుంది. ఇది క్లౌడ్ మౌలిక వసతులపై ఆధారపడకుండా వివిధ భారతీయ భాషల్లో సంభాషణాత్మక ఏఐ అనుభవాలను అందిస్తుంది.

డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమితాబ్ నాగ్ మాట్లాడుతూ, "బహుభాషా ఏఐ కేవలం సాంకేతిక మార్పు మాత్రమే కాదు. భారతదేశంలో ప్రజల ప్రయోజనాలపై ప్రభావం చూపే కీలక మౌలిక సదుపాయం. ఇది జనాభా స్థాయిలో వివిధ భాషల్లో సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. భారతీయ భాషల కృత్రిమ మేధ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా, తక్కువ స్వీయ నిర్వహణ పరికరాల వాతావరణాల్లో పనిచేసే 'సునో సూత్ర' వంటి పరిష్కారాలను ప్రోత్సహించడం ద్వారా భాషిణి ఈ మార్పునకు ఊతమిస్తోంది. తద్వారా దేశంలోని ప్రతి ప్రాంతంలో ప్రతి భాష మాట్లాడే చివరి మైలు పౌరునికి సైతం వాయిస్ ఆధారిత మేధోసంపన్న సేవలను చేరవేస్తోంది.

భాషా లభ్యత, డిజిటల్ అక్షరాస్యత కనెక్టివిటీకి సంబంధించిన సవాళ్లను పరిష్కరించేలా ఆచరణాత్మక ఏఐ పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం భాషిణి బహుభాషా ఏఐ మౌలిక వసతులను, ఓపెన్ - సోర్స్ సాంకేతికతలలో కరెంట్ ఏఐకి ఉన్న నైపుణ్యాన్ని వ్యోమ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ఒకచోటకు చేరుస్తుంది.

కొత్త వినియోగ విధానాలు, హార్డ్‌వేర్ మెరుగుదల, మోడల్ ఆప్టిమైజేషన్, తక్షణ వినియోగానికి సిద్ధంగా ఉండే అప్లికేషన్ల ద్వారా సునో సూత్ర వేదికను మరింత అభివృద్ధి చేయడానికి పునర్నిర్మించడానికి స్టార్టప్‌లు, పరిశోధకులు, విద్యార్థులు, విద్యా సంస్థలు, ఎంఎస్ఎంఈలు, పరిశ్రమల భాగస్వాములు, స్వతంత్ర ఆవిష్కర్తలను ఈ ఛాలెంజ్ ఆహ్వానిస్తోంది. ఈ పరికరాన్ని మరింత చిన్నదిగా, సమర్థవంతంగా, విభిన్న క్షేత్ర స్థాయి పరిస్థితులలో ఉపయోగించడానికి మరింత అనువుగా మార్చే మార్గాలను అన్వేషించాల్సిందిగా కూడా భాగస్వాములకు సూచించారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్య రక్షణ, పరిపాలన, ప్రజా సేవల పంపిణీ వంటి రంగాలలో దీనిని ఉపయోగించేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. భారతదేశంలోని భాషా,భౌగోళిక వైవిధ్యాలన్నింటికీ ఏఐ సాంకేతికతలను మరింతగా అందుబాటులోకి తీసుకురావడంపై ప్రధానంగా దృష్టి సారించారు.

ఓపెన్ అప్లికేషన్ ప్రక్రియతో ప్రారంభమై ఈ ఛాలెంజ్ పలు దశల్లో కొనసాగుతుంది. ఎంపిక చేసిన 20 బృందాలకు తమ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి, పరీక్షించడానికి డెవలపర్ కిట్లు, సునో సూత్ర ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తారు. దీంతో పాటు వారికి భాషిణి, కరెంట్ ఏఐ సంస్థలకు చెందిన నిపుణుల నుంచి నుండి సాంకేతిక మార్గదర్శకత్వం కూడా లభిస్తుంది.

ఫైనలిస్ట్‌లు తమ నమూనాలను నిపుణులైన జ్యూరీ ముందు ప్రదర్శిస్తారు. విజేతలుగా నిలిచిన బృందాలు రూ. 80 లక్షల వరకు విలువైన బహుమతులను గెలుచుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలలో తమ సాంకేతికతను విస్తృతంగా వినియోగంలోకి తెచ్చే అవకాశాలను పొందుతారు.

ఆవిష్కరణల వ్యవస్థలో ఉమ్మడి భాగస్వామ్యాన్ని కూడా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, ఇంజనీర్లు, పరిశోధకులు, విద్యా సంస్థలను కలిపి పనిచేసే బృందాలను ఇది ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుంది.

వ్యోమ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ లోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న డిజిటల్ ఇండియా భాషిణి డివిజన్ (డీఐబీడీ) కృత్రిమ మేధ ఆధారిత బహుభాషా డిజిటల్ సమ్మిళితాన్ని, భాషా సాంకేతికతను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన భారత జాతీయ కార్యక్రమం. నేషనల్ హబ్ ఫర్ లాంగ్వేజ్ టెక్నాలజీ (ఎన్హెచ్ఎల్టీ) ద్వారా పరిపాలన, ప్రభుత్వ వేదికలు, వివిధ సంస్థల కోసం భారతీయ భాషలలో విస్తరించదగిన వాయిస్, టెక్స్ట్ ఆధారిత ఏఐ సేవలను భాషిణి అందుబాటులోకి తెస్తోంది. ఈ వేదిక ప్రస్తుతం 800కు పైగా ప్రభుత్వ వెబ్‌సైట్‌లకు సేవలందిస్తోంది. అలాగే రోజుకు 1.5 కోట్లకు పైగా ఇన్ఫరెన్స్‌లను ప్రాసెస్ చేస్తూ 36 భారతీయ టెక్స్ట్ భాషలు, 23 భారతీయ వాయిస్ భాషలు, 35 అంతర్జాతీయ భాషలకు మద్దతు ఇస్తోంది. ఓపెన్ సోర్స్ ఆవిష్కరణలు, బహుభాషా ఏఐ పరిశోధనలు, డేటాసెట్‌ల రూపకల్పన, స్టార్టప్‌ల ప్రోత్సాహం, విద్యాసంస్థల భాగస్వామ్యాలను కూడా డీఐబీడీ ముమ్మరంగా ముందుకు తీసుకువెడుతూ భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది.

# దేవినేని వెంకట రమణకు ఘన నివాళులు

## -నందిగామ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన ప్రజానేత..

## -రైతాంగ అభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా గుర్తింపు

## -టీడీపీ నాయకుల పూలమాలలతో భావోద్వేగ నివాళి



విజయవాడ, జూన్ 4: నందిగామ ప్రాంత ప్రజల ఆరాధ్య నాయకుడు, మాజీ మంత్రి స్వర్గీయ దేవినేని వెంకట రమణ 27వ వర్ధంతి సందర్భంగా విజయవాడలో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర నాయకులు గన్నే ప్రసాద్ (అన్నా) కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగ వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా గన్నే ప్రసాద్ (అన్నా) పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దేవినేని వెంకట రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కృష్ణా జిల్లా రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నేతగా దేవినేని వెంకట రమణ నిలిచిపోయారని అన్నారు.

నందిగామ మెట్ట ప్రాంత రైతాంగ అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. రైతాంగ అభివృద్ధి, గ్రామీణ సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో రమణ పాత్ర అత్యంత కీలకమని నాయకులు పేర్కొన్నారు. నేటి తరానికి ఆదర్శప్రాయమైన నాయకుడిగా ఆయన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసిన నాయకుడిగా ఆయన పేరు నందిగామ ప్రాంత ప్రజల హృదయాల్లో స్థిరంగా నిలిచిపోయిందని నివాళుల సభలో గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాసరావు, కరణం జగన్మోహన్, పొన్నం రవి, చావా నరసింహారావు, తాడికొండ నరేంద్ర, మల్లెల వాసు, వెల్లంకి సుధాకర్, బి. ఆంజనేయులు, నరేవల్లి రాధాకృష్ణ, బందారుపల్లి అనిల్, బుర్ర కనకరావు, పైలా సతీష్, సురేష్, వీరమాచనేని సురేంద్ర తదితరులు పాల్గొని దేవినేని వెంకట రమణకు శ్రద్ధాంజలి ఘటించారు.

# యువత చేతుల్లోనే రేపటి భారత్!

## విద్య, నైపుణ్యాలు పెంపొందించుకొని ఉన్నతంగా ఎదగాలి
## ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి
## సోషల్ మీడియాను దుర్వినియోగం చేయొద్దు
## గిరిజనుల సాధికారత లక్ష్యంగా కమిషన్ అడుగులు
## జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా

ఎన్టీఆర్, జూన్ 4: యువతే దేశ భవిష్యత్తుకు పునాది అని.. నేటి యువత నైపుణ్యాలను పెంపొందించుకుని, ఉన్నతంగా ఎదిగి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా అన్నారు. జాతీయ ఎస్టీ



కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్యా.. కమిషన్ సభ్యులు నిరుపమ్ చక్మా, జాటోతు హుస్సేన్, సెక్రటరీ ప్రశాంత్ కుమార్ సింగ్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, డైరెక్టర్ ఎస్.భార్గవి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు.

అనంతరం నేషనల్ సికెల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్ కార్యక్రమం అమలుతీరుకు సంబంధించిన ప్రదర్శనను పరిశీలించారు. ప్రధానంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మిషన్ అమలు తీరుతెన్నులను వైద్యారోగ్య శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల వివరాలను పరిశీలించారు. 17 శాఖల సమన్వయంతో అమలవుతున్న 25 కార్యాచరణలపై అధికారులు కమిషన్‌కు వివరించారు. కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గిరిజన యువతతో జరిగిన యువ సంవాద్ కార్యక్రమం సందర్భంగా అంతర్ సింగ్ ఆర్యా మాట్లాడుతూ గిరిజనుల హక్కుల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధి జాతీయ ఎస్టీ కమిషన్ లక్ష్యమని.. ఈ లక్ష్యాల సాధనకు కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. గౌరవ ప్రధానమంత్రి దిశానిర్దేశానికి ఆకాంక్షలకు అనుగుణంగా అమలవుతున్న ఏక్ పేడ్ మా కే నామ్, నేషనల్ సికెల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్, యువ సంవాద్ కార్యక్రమాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. యువత సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని.. సైబర్ నేరాలు, దుష్ప్రచారాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.మన్ కీ బాత్, పరీక్షాపే చర్చ వంటి కార్యక్రమాల విశిష్టతను అర్థం చేసుకుంటూ ముందడుగు వేయాలన్నారు. గౌరవ ప్రధాని ప్రజలకు చేరువగా ఉండాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. యువ సంవాద్ అనేది కేవలం గిరిజన యువతకే కాకుండా అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రతిచోటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భావి తరాల భవిష్యత్తును క్రమబద్ధంగా మార్చాలంటే ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యమని పేర్కొన్నారు.

కార్యక్రమం సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు నిరుపమ్ చక్మా, జాటోతు హుస్సేన్, సెక్రటరీ ప్రశాంత్ కుమార్ సింగ్.. కమిషన్ విధివిధానాల గురించి వివరించారు. ఎస్టీల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడం. రాజ్యాంగం, చట్టాల ద్వారా ఎస్టీలకు కల్పించిన రక్షణలను పర్యవేక్షించడం, ఎస్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి సూచనలు చేయడం, ఎస్టీలపై జరిగే వివక్ష, అన్యాయాలు, హక్కుల ఉల్లంఘనలపై విచారణ చేపట్టడం, గిరిజన యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను పెంపొందించేందుకు సూచనలు చేయడం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ పరిరక్షణకు తోడ్పాటు అందించడం వంటి వాటిని వివరించారు. కార్యక్రమం సందర్భంగా కమిషన్ ఛైర్మన్, సభ్యులు.. యువతతో ప్రత్యక్షంగా సంభాషించి విద్య, ఉపాధి, ఉన్నత విద్యలో ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. యువత విజ్ఞప్తులను పరిశీలించి తగిన సిఫార్సులు ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా నీట్, జేఈఈ పోటీ పరీక్షలకు అందిస్తున్నశిక్షణ, స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్ కోచింగ్, పరిశ్రమల స్థాపన దిశగా గిరిజన యువతను ప్రోత్సహించడం, వివిధ పథకాలు, ఉపకారవేతనాలు తదితర అంశాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, డైరెక్టర్ ఎస్.భార్గవి వివరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.ఫణి ధూర్జటి, గిరిజన విద్యార్థులు, గిరిజన యువత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విజయం గమ్యం కాదు.. ఉన్నత లక్ష్యాలకు తొలి అడుగు..

## -సబ్జెక్టుపై పట్టు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతోనే శిఖరాగ్రాలకు చేరుకోవాలి
## -ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఘన సత్కారం




ఆదిలాబాద్, జూన్ 4:ఒక విజయం వద్దే ఆగిపోకుండా, దానిని మరిన్ని విజయాలకు పునాదిగా మలుచుకుని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. గురువారం ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మా నించరు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు కేవలం పరీక్షల ఫలితాలకు మాత్రమే పరిమితం కాకుండా, భవిష్యత్ జీవితానికి బలమైన పునాది కావాలని ఆకాంక్షించారు. గురుకుల విద్యాసంస్థల్లో చదివి పదో తరగతిలో ప్రతిభ కనబరి చిన 12 మంది, ఇంటర్మీడి యట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థుల తో పాటు ఏపీ మోడల్ స్కూల్, బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలకు చెందిన మరో ఐదుగురు విద్యార్థులను సత్కరిం చడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ రంగాల్లో పోటీ తీవ్ర స్థాయికి చేరుకుందని, కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాకుండా సబ్జెక్టుపై లోతైన అవగాహన, విశ్లేషణాత్మక దృష్టి, నిరంతర అధ్యయన తపన అవసరమని పేర్కొన్నారు. బట్టీ పట్టే విధానా నికి బదులుగా ప్రతి అంశాన్ని అర్థం చేసుకుంటూ నేర్చుకునే అలవాటు పెంపొందించు కోవాలని సూచించారు.

ప్రశ్నించే విద్యార్థే నిజమైన విద్యార్థి అవుతాడని, జిజ్ఞాసే విజయానికి మూలమని చెప్పారు.

విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, దేశ-విదేశాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై అవగాహన పెంపొందించుకోవా లన్నారు.విద్యార్థులు చదువుతో పాటు హాబీలు, క్రీడలు, లైఫ్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలని, పుస్తక పఠనం, మొక్కల పెంపకం, ఈత, కరాటే వంటి కార్యకలాపాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని వివరించారు. అలాగే నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి సాఫ్ట్ స్కిల్స్ ఆధునిక ప్రపంచంలో అత్యంత కీలకమని తెలిపారు. తమతో పాటు వెనుకబడిన సహ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శనం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వ్యక్తిగత విజయంతో పాటు సమాజాభివృద్ధికి కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలను మరింత ఉన్నత లక్ష్యాలకు పునాదిగా మలుచుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లల విజయాల వెనుక తల్లిదండ్రులు అందించిన సహకారం, ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం అమూల్యమని పేర్కొంటూ వారందరికీ కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పూర్వ క్యాగ్ (సీఏజీ) శ్రీ వినోద్ రాయ్ సంపాదకత్వంలో రూపొందిన 'వెన్ ఆడిట్ మేటర్స్' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉప రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, జూన్ 4: ఉప రాష్ట్రపతి శ్రీ సి.పి.రాధాకృష్ణన్ ఇవాళ తన అధికార నివాసంలో 'వెన్ ఆడిట్ మేటర్స్: కాగ్ ఇంటర్వెన్షన్స్ దట్ మేడ్ ఎ డిఫరెన్స్' పేరిట మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ శ్రీ వినోద్ రాయ్ సంపాదకత్వంలో రూపొందిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- "ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఆడిట్ ప్రక్రియ ఓ కీలక ఉపకరణం" అని అభివర్ణించారు. చట్టానికి అనుగుణంగా, సమర్థంగా, నిష్పక్షపాతంగా ప్రజా హితం కోసమే ప్రజాధనం వినియోగమవుతున్నదని ఇది పౌరులకు భరోసా ఇస్తుందన్నారు. ప్రభుత్వాలు వ్యవస్థలను మెరుగుపరచడానికి, లోపాలను సరిదిద్దడానికి కూడా ఆడిట్ తోడ్పడుతుందని చెప్పారు. అంతేకాకుండా దేశం, పౌరుల మధ్య విశ్వాసాన్ని కూడా బలపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజా జీవనంలో నైతిక విలువల ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తూ- ఆడిట్-నైతిక విలువల సమ్మేళనం రూపాంతరీకరణకు తోడ్పడే ఉపకరణమన్నారు. మెరుగైన ప్రజాసేవా ప్రదానానికి, ప్రభుత్వ వనరుల సమర్థ వినియోగానికి, అధిక పునరుత్థాన సామర్థ్యానికి ప్రజా విశ్వాసం ఇనుమడించేందుకు దోహదం చేస్తుందని ఉప రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ పరిపాలనకు విలువల అనుసరణ నైతిక పునాదిగా మారాలని ఆయన ఉద్ఘాటించారు. అలాగే, పాలన వ్యవస్థలు ప్రజా ప్రయోజనాల దిశగా కృషి చేసేందుకే రూపొందాయని పేర్కొన్నారు.

భారత ఇతిహాసాలు-గ్రంథాల్లో ప్రతిబింబించే ధర్మం, రాజధర్మం, ప్రభుత్వ కర్తవ్యం వంటి భావనలలో దేశం జవాబుదారీతనం, నైతిక పాలన సంప్రదాయాలు లోతుగా పాదుకున్నాయని చెప్పారు. ఆర్థిక పర్యవేక్షణ, జవాబుదారీతనం సూత్రాలను కౌటిల్యుని అర్థశాస్త్రం నిర్దేశిస్తుందని ఉప రాష్ట్రపతి గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగం ద్వారా ఈ ఆదర్శాలు సంస్థాగతం అయ్యాయని చెప్పారు. ఇది చట్టబద్ధ పాలన, ఆర్థిక జవాబుదారీతనం, పార్లమెంటరీ పర్యవేక్షణ కింద 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' పేరిట స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం ప్రాధాన్యాన్ని ఆయన విశదీకరించారు. బడ్జెట్ పద్దులకు చట్టసభల ఆమోదంతో ప్రారంభమై, పబ్లిక్ అకౌంట్స్ కమిటీల ద్వారా ఆడిట్-పరిశీలన వరకు ఇది కొనసాగుతుందని ఆయన గుర్తుచేశారు. క్రమబద్ధ ఆర్థిక పర్యవేక్షణకు ఈ ప్రక్రియ ఒక సమగ్ర చట్రాన్ని రూపొందిస్తుందని, ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలపై ప్రజాస్వామ్య నియంత్రణను బలోపేతం చేస్తుందని తెలిపారు.ఆడిటింగ్ వ్యవస్థలలో నిరంతర ప్రగతి అవసరాన్ని స్పష్టం చేస్తూ- శిక్షణ, సాంకేతిక ఉన్నతీకరణ, పనితీరు మూల్యాంకనం, గణాంక విశ్లేషణ, రంగాల వారీ నైపుణ్య ప్రాధన్యాలను ఉప రాష్ట్రపతి ఉద్ఘాటించారు. అత్యున్నత సమగ్రత, నైతిక ప్రవర్తన ప్రమాణాలకు ఆడిటర్లు కూడా కట్టుబడాలని ఆయన వ్యాఖ్యానించారు.తన చేతుల మీదుగా ఆవిష్కృతమైన పుస్తకం గురించి చెబుతూ- పూర్వ సీనియర్ ఆడిట్ అధికారుల అనుభవాలను గుదిగుచ్చుతూ, కీలక ఆడిట్ ప్రక్రియల వెనుకగల ఉదంతాలను సులభగ్రాహ్యంగా, సోదాహరణంగా, సరళ శైలిలో రూపొందించడంపై శ్రీ వినోద్ రాయ్ సహా ఆయన సహచరులను ఉపరాష్ట్రపతి అభినందించారు.

# మధ్యప్రదేశ్ సిద్ధి జిల్లాలో సౌకర్యాల కొరత కారణంగా ఏడాది వ్యవధిలో 53 ప్రసూతి మరణాలు.. సుమోటోగా స్వీకరించిన ఎన్‌హెచ్ఆర్‌సీ

న్యూ ఢిల్లీ, జూన్ 4:మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాలో ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 మధ్య కాలంలో అవగాహన రాహిత్యం, వైద్య సదుపాయాల కొరత కారణంగా ప్రసవానికి ముందు, ప్రసవానంతరం 53 మంది గర్భిణీలు మరణించడంపై భారత జాతీయ మానవ హక్కుల సంఘం తీవ్రంగా స్పందించింది. ఓ మీడియా నివేదిక ఆధారంగా ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ నిర్వహించిన కమ్యూనిటీ మెటర్నల్ హెల్త్ లీగ్ గ్రేడింగ్ లో సిద్ధి జిల్లా ఎప్పుడూ వెనుకబడే (చివరి మూడు స్థానాల్లో) ఉంటోందని నివేదికలు చెబుతున్నాయి.

మీడియా కథనంలోని అంశాలు నిజమైతే ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని కమిషన్ అభిప్రాయపడింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

మే 29, 2026న ప్రచురితమైన మీడియా నివేదిక ప్రకారం.. మరణించిన 53 మంది మహిళల సగటు వయసు 26 సంవత్సరాలు. వీరిలో చాలా మంది మొదటి లేదా రెండోసారి తల్లులైనవారే. జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రిలో వైద్యులు, సాంకేతిక నిపుణులతో సహా కనీస మౌలిక సదుపాయాల కొరత ఉన్నట్లు వార్తా కథనం పేర్కొంది. దీని కారణంగా రోగులను దూరంగా ఉన్న రేవా జిల్లాలోని పెద్ద ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ ప్రయాణం వల్ల గర్భిణీల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. సిద్ధి జిల్లాలోని పలు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేదని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని ఓ అంబులెన్స్ డ్రైవర్ తెలిపారు.. గర్భిణీలను అంబులెన్స్ వరకు తీసుకురావడానికి రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం మంచాలపై మోసుకురావాల్సి వస్తోందని చెప్పారు.

# గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రారంభం కానున్న తొలి ప్రపంచ యోగాసన క్రీడా ఛాంపియన్‌షిప్

న్యూఢిల్లీ, జూన్ 4ప్రపంచవ్యాప్తంగా యోగా అపారమైన ప్రజాదరణ పొందుతోందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పేర్కొన్నారు. రేపు అంటే జూన్ 4న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో తొలి ప్రపంచ యోగాసన క్రీడా ఛాంపియన్‌షిప్ 2026 ప్రారంభం కానున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఈ వేదిక ప్రపంచవ్యాప్తంగా ఉన్న యోగా ఔత్సాహికులను ఒకచోట చేరుస్తోందని, యోగాసనానికి సంబంధించిన ప్రపంచ క్రీడా ప్రణాళికలో ఇది ముఖ్యమైన విజయమని ప్రధానమంత్రి తెలియజేశారు. రేపు సాయంత్రం సుమారు 6:40 గంటలకు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొంటానని శ్రీ మోదీ ప్రకటించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వారికి అభినందనలు తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొనే వారందరికీ తన శుభాకాంక్షలు తెలిపారు.

"ప్రపంచవ్యాప్తంగా యోగాకు అత్యంత ప్రజాదరణ లభిస్తోంది! రేపు, జూన్ 4న అహ్మదాబాద్‌లో చాలా ప్రత్యేకమైన పోటీ జరగనుంది. అదే ప్రపంచ యోగాసన క్రీడల ఛాంపియన్‌షిప్ - 2026. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న యోగా ఔత్సాహికులను ఈ వేదిక ఒక్కచోటకు చేరుస్తోంది.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యం

## -జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి
## -మునిపల్లి, కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ
## -వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరిక



సంగారెడ్డి, జూన్ 4 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు.

గురువారం మునిపల్లి, కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని హాజరు పట్టికలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు.

అనంతరం ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించి అక్కడి సేవల నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే మందుల నిల్వలను తనిఖీ చేసి, గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని అధికారులకు స్పష్టం చేశారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని ఆదేశించారు.

వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆమె, వైద్యులు మరియు సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు.

వైద్యాధికారులతో సమీక్ష సమావేశం

అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన వైద్యాధికారుల సమావేశంలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడం ద్వారా వైద్య ఆరోగ్య శాఖకు మంచి పేరు తీసుకురావాలని డా. కె. లలితాదేవి ఆకాంక్షించారు.

# కూటమి వైఫల్యాలపై వైసీపీ సమరభేరి

## 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్ ఆవిష్కరించిన మల్లాది విష్ణు
## సూపర్ సిక్స్ కాదు.. సూపర్ ఫెయిల్: మాజీ ఎమ్మెల్యే విమర్శ
## రాష్ట్రంపై రూ.3.40 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని ఆరోపణ




అమరావతి, జూన్ 4: కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు పూర్తిగా విఫలమయ్యాయని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. "బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ"గా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా గురువారం సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో మాజీ డిప్యూటీ మేయర్ శైలజారెడ్డితో కలిసి 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్‌ను మల్లాది విష్ణు ఆవిష్కరించారు. అనంతరం పోస్టర్లతో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయని కూటమి ప్రభుత్వంపై నిరసనగా మేనిఫెస్టో ప్రతులను దహనం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో అన్ని నియోజకవర్గాల టౌన్‌హాళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, గత ఐదేళ్ల జగన్ పాలనలో అమలైన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

చంద్రబాబు రెండేళ్ల పాలనలో రాష్ట్రంపై అదనంగా రూ.3, 40,000 కోట్ల అప్పుల భారం పడిందని మల్లాది విష్ణు ఆరోపించారు. గతంలో అప్పులపై విమర్శలు చేసిన చంద్రబాబు, ఇప్పుడు దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### వైద్యం, విద్యా రంగాలు నిర్వీర్యం

బడ్జెట్ కేటాయింపులు లేకుండా అరకొర విధానాలతో ప్రభుత్వం నడుస్తోందని మల్లాది విష్ణు విమర్శించారు. ఆరోగ్యశ్రీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు' ద్వారా ఆధునీకరించిన ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్నాయని అన్నారు. మెగా డీఎస్సీ ప్రకటనతో పాటు స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయ నియామకాల్లో కూడా అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు.

### సంక్షేమ పథకాలు, పెన్షన్లలో కోతలు

కరోనా కష్టకాలంలోనూ గత జగన్ ప్రభుత్వం డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.2.75 లక్షల కోట్లు పారదర్శకంగా బదిలీ చేసిందని మల్లాది విష్ణు గుర్తుచేశారు. ప్రతి పథకాన్ని పుస్తక రూపంలో ప్రజల ఇంటి ముందుకు తీసుకెళ్లి వివరించామన్నారు.కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏకంగా 6 లక్షల మందికి పెన్షన్లు తొలగించిందని మండిపడ్డారు. కొత్త పెన్షన్లు మంజూరు చేసే పరిస్థితి లేదని, గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసిన మరుసటి నెలలోనే పెన్షన్ అందించే వారమని తెలిపారు.

### రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

రాష్ట్రంలో మొక్కజొన్న, వరి పండించే రైతులు మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని మల్లాది విష్ణు అన్నారు. రైతులు రోడ్లపైకి వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయమే దండగ అన్న రీతిలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.

### విజయవాడ సెంట్రల్‌లో బియ్యం మాఫియా

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో తెలుగుదేశం ముఠాలు పేదల బియ్యాన్ని దోచుకుని అక్రమంగా అమ్ముకుంటున్నాయని మల్లాది విష్ణు ఆరోపించారు. నున్న పోలీస్ స్టేషన్ సమీపంలో బియ్యం లారీ పట్టుబడటమే దీనికి ఉదాహరణ అని అన్నారు. "ఇదేనా మీ సుపరిపాలన బియ్యం దొంగతనాలే మీ మంచి పరిపాలనకు కేరాఫ్ అడ్రస్సా?" అని ఆయన ప్రశ్నించారు.

### బుడమేరు వరద బాధితులకు అన్యాయం

బుడమేరు వరదల కారణంగా విజయవాడ ప్రాంతం తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం విఫలమైందని మల్లాది విష్ణు విమర్శించారు. మంత్రులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. బుడమేరు ఆధునీకరణకు రూ.500 కోట్లు మంజూరు చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు ప్రజలకు ఇచ్చిన ఏ హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని, అన్ని రంగాల్లోనూ విఫలమైందని మల్లాది విష్ణు స్పష్టం చేశారు. ప్రజల పక్షాన వైసీపీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజనుల సమగ్ర వికాసం దేశ ప్రగతికి సమ్మిళిత అభివృద్ధి స్వభావాన్ని అందిస్తుంది: రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము

న్యూఢిల్లీ, జూన్ 4:ఏకీకృత గిరిజన అభివృద్ధి సంస్థలతో పాటు ఏకీకృత గిరిజనాభివృద్ధి ప్రాజెక్టులను పటిష్టపరచడం అంశంపై న్యూఢిల్లీలో ఈ రోజు (2026 జూన్ 3)న ఏర్పాటు చేసిన జాతీయ సమావేశాన్ని రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా బెంగళూరు ఇండియన్ సైన్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన నానో సైన్స్, ఇంజినీరింగ్ సెంటరుతో పాటు, ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలల్లో 75 స్పేస్ ల్యాబ్స్‌ను కూడా రాష్ట్రపతి ప్రారంభించారు.

సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఈ సమావేశం గిరిజనుల స్థితిలో మార్పును తీసుకువచ్చే వారి సమావేశమని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను గిరిజనులు నివసిస్తున్న పల్లెలకూ, ఇళ్లకూ తీసుకు పోవాల్సిన బాధ్యత ఈ సమావేశంలో పాల్గొంటున్న అందరిదీనని రాష్ట్రపతి అన్నారు. ఇలా చేస్తే, వారు గిరిజన సోదరీ, సోదరుల జీవితాల్లో పెను మార్పును తీసుకురాగలుగుతారన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ, ప్రాజెక్టు స్థాయుల్లోనూ పని చేసే వారంతా ఒక ఉమ్మడి ధ్యేయంతో, ఒక పెద్ద లక్ష్యంతో ఏకతాటి మీదకు వచ్చి చర్చిస్తే అప్పుడు అనేక ఫలప్రద పరిష్కారాలు తప్పక లభిస్తాయని శ్రీమతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గిరిజనుల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చలు చోటుచేసుకోనున్నాయన్న సంగతి తెలుసుకొని తాను సంతోషిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. వివిధ ఏజెన్సీలు, ప్రాజెక్టుల్లో పనిచేసే వారు చక్కని ఆలోచనలు చేసి మరీ తీసుకొనే నిర్ణయాల అధారంగా ముందుకు సాగుతారన్న నమ్మకం తనకు ఉందని రాష్ట్రపతి తెలిపారు. దీనితో వేరువేరు పథకాల ప్రయోజనాలు గిరిజనుల్లో ప్రతి ఒక్క వ్యక్తి చెంతకు చేరుతాయన్నారు.

ఏ ప్రాజెక్టుకు సంబంధించిన దస్త్రం అయినా, దస్తావేజు అయినా వాటి పరమార్థం మనుషులకు సాయపడటమేననే వాస్తవంపై దృష్టిని కేంద్రీకరించాల్సిందిగా ఆసక్తిదారులందరికీ రాష్ట్రపతి సలహాను ఇచ్చారు. ఈ ప్రాజెక్టులతో సంబంధమున్న వ్యక్తులూ, ఏజెన్సీలూ ప్రతి గర్భవతికీ చాలినంత పోషణ, గిరిజన బాల బాలికలకు ఒక మంచి బళ్లో చదువుకునే అవకాశం, గిరిజన యువతకు ఆత్మగౌరవంతో కూడిన జీవనోపాధి.. వీటితో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి ఒక్క గిరిజన కుటుంబానికీ అందించడంపై శ్రద్ధ వహించాలని శ్రీమతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఈ ప్రాజెక్టుతో ముడిపడిన అన్ని ఏజెన్సీలూ, సిబ్బందీ తప్పక ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆమె కోరారు.

ఆధునిక అభివృద్ధి యత్నాలతో పాటే గిరిజనుల సంస్కృతి, జ్ఞాన సంప్రదాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల రాష్ట్రపతి హర్షాన్ని వ్యక్తం చేశారు.

వ్యక్తులతో పాటు సమాజ పురోగతిలో విద్య ప్రధాన పాత్రను పోషిస్తుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. గిరిజన బాలల, యువత విద్యావంతులయ్యేలా, నైపుణ్యాలను సాధించుకొనేలా మనస్ఫూర్తిగా తోడ్పడాల్సిందిగా ఆసక్తిదారులకు రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు. దేశమంతటా దాదాపు 500 ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలలను ఇప్పటికే ఏర్పాటు చేశారని తెలుసుకొని ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పౌరులంతా 2047 కల్లా వికసిత్ భారత్‌ను నిర్మించే దిశగా ముందుకు కదులుతున్నారని రాష్ట్రపతి అన్నారు. గిరిజనుల సమగ్రాభివృద్ధి ఈ లక్ష్యంలో ఒక అంతర్భాగమని ఆమె తెలిపారు. ఇది దేశ ప్రగతికి సమ్మిళిత స్వభావాన్ని జతచేస్తుందని వివరించారు. ఈ సమావేశంలో లభించే సూచనలు, తీర్మానాలు, మార్గనూచీతో గిరిజనుల సర్వతోముఖ అభివృద్ధికి ఉద్దేశించిన పథకాలను అట్టడుగు స్థాయికి తీసుకుపోయేందుకు ఒక కార్యాచరణను ఖరారు చేయవచ్చన్న ఆశాభావాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి..

## -మంచిర్యాల డీసీపీ భాస్కర్

### -గంజాయి, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన



అమరావతి, జూన్ 4: నేటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు బానిసలై తమ విలువైన భవిష్యత్తును, కుటుంబాల ఆనందాన్ని నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రజలందరూ బాధ్యతగా పోలీస్ శాఖకు సహకరించాలని మంచిర్యాల జిల్లా డీసీపీ భాస్కర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ? 99 రోజుల ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా, బెల్లంపల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్ నగర్‌లో గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి డీసీపీ భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ లింకులు, సోషల్ మీడియా మోసాల ఉచ్చులో పడొద్దని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద కాల్స్ లేదా లింక్‌లకు స్పందించవద్దని, ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే తక్షణమే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని, వేధింపులు ఎదురైతే నిర్భయంగా ముందుకు రావాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర పనులు చేయవద్దని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి- రమేష్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, పారిశుధ్య, హానికారక చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలన్నారు. మున్సిపాలిటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున, ప్లాస్టిక్ రహిత 'హరిత బెల్లంపల్లి' నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమాలలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్, వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యానారాయణ, టూటౌన్ ఎస్ఐ సిహెచ్. కిరణ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# శిశువు మృతదేహం కేసు ఛేదించిన పోలీసులు

### -ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో వెలుగులోకి వచ్చిన విషాద ఘటన

### -నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు - డీఎస్పీ పల్లె శ్రీనివా

అమరావతి,జూన్ 4: అచ్చంపేట పట్టణంలోని విద్యా నగర్ కాలనీలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపగా, పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన అచ్చంపేట పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలతో పాటు స్థానిక మైత్రీ ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. దర్యాప్తులో భాగంగా మృత శిశువు తల్లి 25 ఏళ్ల మహిళ అని గుర్తించారు. ఆమె ఈ నెల 1వ తేదీ రాత్రి మైత్రీ ఆస్పత్రిలో చేరగా, 2వ తేదీన నిర్వహించిన వైద్య పరీక్షల్లో గర్భంలోని శిశువు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం తల్లి అంగీకారంతో మృత శిశువును బయటకు తీసి ఆమెకు అప్పగించినట్లు పోలీసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అయితే వ్యక్తిగత కారణాల వల్ల మృత శిశువును తన స్వగ్రామానికి తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడటంతో, ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు ఆయాలకు సరైన ప్రదేశంలో జాగ్రత్తగా పూడ్చిపెట్టాలని మహిళ కోరినట్లు విచారణలో తేలింది. కానీ వారు ఆ బాధ్యతను నిర్లక్ష్యంగా నిర్వహించడంతో విద్యానగర్ కాలనీలో శిశువు మృతదేహాన్ని సరిగా పూడ్చిపెట్టలేదని పోలీసులు గుర్తించారు. దీంతో అక్కడ సంచరించిన కుక్కలు మట్టిని తవ్వి శిశువు మృతదేహాన్ని బయటకు తీసి, అనంతరం అది మరో ప్రాంతంలో కనిపించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలో మృత శిశువు మృతదేహం నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించిన వారందరిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పి. శ్రీనివాస్ తెలిపారు.

# పోలవరం బ్యాక్‌వాటర్ ముప్పుపై కేంద్రానికి ఎమ్మెల్యే పాయం వినతి

### -గోదావరి ముంపు ప్రాంత ప్రజలను ఆదుకోవాలి

### -ప్రభావిత గ్రామాల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి

### -రైతులకు పరిహారం, నిర్వాసితులకు ప్రత్యేక పునరావాస ప్యాకేజీ ఇవ్వాలి

అమరావతి, జూన్ 4:పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని పలు గ్రామాలు, వ్యవసాయ భూములు, ప్రజల జీవనోపాధి, మౌలిక సదుపాయాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ, సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారి సంజయ్ నందన్‌కు ఆయన సమగ్ర వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో తీవ్ర ముంపు ముప్పు నెలకొనే అవకాశం ఉందన్నారు. అధికారిక అంచనాల కంటే వాస్తవ పరిస్థితుల్లో మరింత విస్తీర్ణంలో వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వందలాది కుటుంబాలు నిర్వాసితులయ్యే పరిస్థితి తలెత్తవచ్చని అన్నారు.

గోదావరి వరదల సమయంలో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే వివరించారు. వాగులు, ఉపవాగులు, సహజ నీటి పారుదల మార్గాలపై బ్యాక్‌వాటర్ ప్రభావం పడితే నీటి నిల్వ సమస్యలు పెరిగి వ్యవసాయం, గ్రామీణ జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

అశ్వాపురంలోని దేశానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన హెవీ వాటర్ ప్లాంట్ భద్రతకు కూడా భవిష్యత్తులో ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభావిత గ్రామాల్లో సమగ్ర శాస్త్రీయ బ్యాక్‌వాటర్ సర్వే నిర్వహించాలని, ఉపనదులపై బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని అధ్యయనం చేయాలని కోరారు.

భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని, నిర్వాసితుల కోసం ప్రత్యేక పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీ ప్రకటించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అలాగే శాశ్వత వరద నియంత్రణ చర్యలు, రక్షణ కరకట్టలు, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు, నిపుణులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. శాస్త్రీయ అధ్యయనం, ప్రజాభిప్రాయం లేకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోరాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను సంబంధిత వర్గాలతో సంప్రదింపులు లేకుండా అమలు చేయరాదని పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ, సంబంధిత అధికారులు అత్యవసర చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




అమరావతి, జూన్ 4: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా అత్యంత ముఖ్యమని తెలిపారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం, అనర్హులైన పేర్లు తొలగించబడటం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులు తమ విధులను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, 2002 ఓటర్ల జాబితా మరియు 2025 తాజా జాబితాలను ఆధారంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కనీసం 95 శాతం సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, అవసరమైన ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర దరఖాస్తు పత్రాలను బిఎల్వోలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా వెయ్యి మంది ఓటర్లకు మాత్రమే పరిమితం ఉండేలా నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరిస్తూ, జూన్ 5 నుండి 14 వరకు శిక్షణ, ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని తెలిపారు.

అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదుకు సంబంధించి అవసరమైన పత్రాలపై కూడా కలెక్టర్ వివరణ ఇచ్చారు. 1987 జులై 1వ తేదీకు ముందు జన్మించినవారు, 1.7.1987 నుండి 2.12.2004 మధ్య జన్మించినవారు, అలాగే 2.12.2004 తర్వాత జన్మించినవారికి వేర్వేరు ధృవపత్రాలు అవసరమవుతాయని తెలిపారు.

జనన ధృవపత్రం, విద్యా ధృవపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు తదితర పత్రాలను వినియోగించవచ్చన్నారు. ఇంటింటి సర్వే ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను సేకరించి జాబితా శుద్ధి చేపడతామని తెలిపారు.

ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత, మహిళలు, దివ్యాంగులు, వలస కార్మికులు వంటి వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, డిపిఓ వై.దోసి రెడ్డి, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'వికసిత్ వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్-20026'ను ప్రారంభించిన మై భారత్




న్యూఢిల్లీ, జూన్ 4యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని యువజన వ్యవహారాల విభాగమైన మేరా యువ భారత్ (మై భారత్), వికసిత్ వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్ (వీవీవీపీ)-2026 మొదటి దశను ప్రారంభించింది. భారత సరిహద్దు గ్రామాల్లో క్షేత్రస్థాయి భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జాతీయ సమైక్యతను పెంపొందించడం, సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా చేపట్టిన ఈ మార్గదర్శక కార్యక్రమం రెండు దశల్లో అమలు కానుంది.

దేశవ్యాప్తంగా 3 లక్షలకు పైగా యువత దీనికి సంబంధించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనగా, వారి నుంచి మొత్తం 500 మంది 'మై భారత్' వాలంటీర్లను ఈ కార్యక్రమంలో పాల్గొనడం కోసం ఎంపిక చేశారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వాలంటీర్లను లదాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని ప్రత్యేకంగా ఎంపిక చేసిన సరిహద్దు గ్రామాల్లో రెండు దశల్లో మోహరిస్తున్నారు. మొదటి దశలో 250 మంది వాలంటీర్లు 43 గ్రామాల్లో క్షేత్రస్థాయి కార్యక్రమాల్లో పాల్గొంటుండగా... మిగిలిన 250 మంది వాలంటీర్లు ఈ నెల చివరలో 50 గ్రామాల్లో జరిగే రెండో దశ కార్యకలాపాల్లో పాలుపంచుకుంటారు.

ఈ కార్యక్రమం సరిహద్దు గ్రామాల్లో నివసించడానికి, స్థానిక సమాజాలతో నేరుగా మమేకమవ్వడానికి యువతకు ఒక విశిష్ట అవకాశాన్ని అందిస్తుంది. గ్రామవాసులు, పంచాయతీ రాజ్ సంస్థలు, స్థానిక పరిపాలన, భద్రతా సిబ్బందితో సంభాషించడం ద్వారా... ఈ కార్యక్రమంలో పాల్గొనే యువత దేశ సరిహద్దు ప్రాంతాల సామాజిక-ఆర్థిక వాస్తవాలు, సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి ఆకాంక్షలు, వ్యూహాత్మక ప్రాముఖ్యాన్నీ ప్రత్యక్షంగా తెలుసుకుంటారు.

సరిహద్దు అవగాహన, సాంస్కృతిక వినిమయం, సామూహిక జీవనం, పరిపాలన, సామాజిక-ఆర్థిక అంచనా, గ్రామాభివృద్ధి ప్రణాళిక, స్వచ్ఛంద సేవ, జాతీయ సమైక్యత వంటి నేపథ్య అంశాల ప్రాతిపదికన ఈ ఏడు రోజుల సమగ్ర కార్యక్రమాన్ని రూపొందించారు. స్వచ్ఛంద కార్యకర్తలు ఇంటింటి సర్వేలు చేపట్టడం, గ్రామ సభ కార్యకలాపాల్లో పాల్గొనడం, పరిశుభ్రత-పర్యావరణ ప్రచారాలకు తోడ్పడటం, గ్రామాల్లో అభివృద్ధి అవకాశాలను గుర్తించడంలో సహాయపడటం వంటి పనుల్లో పాలుపంచుకుంటారు.

బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని, సుస్థిర జీవనశైలి పద్ధతులను ప్రోత్సహించే దేశవ్యాప్త ప్రచారమైన 'నేషన్ ఫస్ట్ ఛాలెంజ్'ను ప్రోత్సహించడం ఈ కార్యక్రమంలోని ఒక ముఖ్యమైన భాగం. మై భారత్ వాలంటీర్లు ఈ ప్రచారంలోని ఐదు కీలక అంశాలను చురుగ్గా ప్రచారం చేస్తారు. అవి స్వదేశీ ఉత్పత్తుల వాడకం, ఆరోగ్యకరమైన వంట పద్ధతులు, ప్రజా రవాణా వినియోగం, ఇంధన పొదుపు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, స్థానిక పర్యాటకానికి గట్టి మద్దతునివ్వడం. కమ్యూనిటీ స్థాయిలో ప్రచారం, అవగాహన కార్యక్రమాల ద్వారా... దేశం పట్ల, పర్యావరణం పట్ల బాధ్యతాయుతమైన పద్ధతులను స్వీకరించేలా ఈ యువకుల బృందం స్థానికులను ప్రోత్సహిస్తారు.

ఈ కార్యక్రమాన్ని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) సహకారంతో అమలు చేస్తున్నారు. దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత చురుకైన భాగస్వామ్యం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047'ను నిర్మించాలనే దార్శనికతకు ఇది అనుగుణంగా ఉంది.

కార్యక్రమం విజయవంతంగా అమలు జరిగేలా చూసేందుకు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో విస్తృత సన్నాహాలు చేపట్టారు. మై భారత్, ఐటీబీపీ, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలు, స్థానిక భాగస్వాములతో కూడిన సమన్వయ యంత్రాంగాలనూ ఏర్పాటు చేశారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రత్యేక కంట్రోల్ రూములు, నోడల్ అధికారులు, గ్రామ కార్యాచరణ ప్రణాళికలు, పాల్గొనేవారికి అవగాహన సదస్సులు, రవాణా ఏర్పాట్లూ చేశారు.

వికసిత్ వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్-2026... దేశ నిర్మాణంలో యువతను క్రియాశీల భాగస్వాములుగా తీర్చిదిద్దడంలోనూ, దేశ యువతకు-దేశ సరిహద్దులోని చైతన్యవంతమైన గ్రామాలకు మధ్య ఉన్న సామాజిక, సాంస్కృతిక, అభివృద్ధి సంబంధాలను బలోపేతం చేయడంలోనూ భారత ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

# జాతీయ క్రీడా రంగ చట్టం-2025 కింద జాతీయ క్రీడల ట్రైబ్యునల్ సభ్యుల నియామకానికి దరఖాస్తుపై ప్రభుత్వ ప్రకటన

న్యూ ఢిల్లీ, జూన్ 4:జాతీయ క్రీడారంగ చట్టం-2025 కింద ఏర్పాటైన చట్టబద్ధ సంస్థ 'జాతీయ క్రీడా ట్రైబ్యునల్ (ఎన్ఎస్‌టీ)కి ఇద్దరు సభ్యులను నియమించడం కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కేంద్ర క్రీడలు-యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటన జారీచేసింది.

చట్ట నిబంధనలకు అనుగుణంగా క్రీడల సంబంధ వివాదాలపై విచారణ, పరిష్కారం లక్ష్యంగా జాతీయ క్రీడా ట్రైబ్యునల్ ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో పనిచేస్తున్న నేపథ్యంలో సభ్యుల నియామకం చేపట్టాల్సి ఉంది.

ఈ మేరకు రెండు ఖాళీలను పూరించే దిశగా ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని మంత్రిత్వశాఖ ప్రకటించింది.

క్రీడలు, ప్రభుత్వ పాలన, న్యాయ రంగాల్లో విస్తృత జ్ఞానం, అనుభవంతోపాటు ప్రజా జీవనంలో ప్రముఖులైన వ్యక్తులు ఈ నియామకానికి అర్హులు. ఎంపిక అనంతరం నియమితులయ్యే సభ్యులకు జాతీయ క్రీడా ట్రైబ్యునల్ నియమావళి-2026లోని నిబంధనల ప్రకారం జీతభత్యాలు, ఇతర సేవా నిబంధనలు-షరతులు వర్తిస్తాయి.జాతీయ క్రీడారంగ చట్టం-2025కు అనుగుణంగా ఏర్పాటు చేసిన అన్వేషణ-ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక నిర్వహిస్తారు. ఈ కమిటీ తొలుత దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల అర్హతలు, అనుభవం, ఇతర యోగ్యతల ప్రాతిపదికన వారి సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఒక జాబితాను రూపొందించి, వ్యక్తిగత ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.అటుపైన అర్హతలు, అనుభవంతోపాటు ముఖాముఖి సమయంలో వారి సామర్థ్యంపై అంచనాలను పరిగణనలోకి తీసుకుంటూ సమగ్ర మూల్యాంకనం ఆధారంగా నియామకానికి కమిటీ తుది సిఫారసు చేస్తుంది.

# మహాసముద్రాల తాపం.. వాతావరణ విపత్తుల రూపం: 'ఎల్‌నినో' మానవాళిపై ప్రభావం

భూగోళంపై మానవాళి మనుగడకు, విశ్వవ్యాప్తంగా వివిధ దేశాల ఆర్థిక స్థిరత్వానికి ప్రకృతి వైపరీత్యాలు, అనిశ్చిత వాతావరణ మార్పులు, అకాల వర్షపాతాలు, తీవ్ర కరువు పరిస్థితులు నేడు అత్యంత ఆందోళనకరమైన సవాళ్లుగా మారాయి. పారిశ్రామిక విప్లవం తదనంతర ఆధునిక యుగంలో మానవ తప్పిదాల వల్ల గ్లోబల్ వార్మింగ్ అంటే భూతాపం రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనివల్ల కాలచక్రాలు తారుమారై రుతుపవనాల గమనం పూర్తిగా గందరగోళంలో పడింది. ఈ విధమైన అంతర్జాతీయ వాతావరణ మార్పులకు దారితీస్తున్న అత్యంత శక్తివంతమైన, సంక్లిష్టమైన సహజ పర్యావరణ దృగ్విషయాలలో "ఎల్‌నినో" అగ్రగామిగా నిలుస్తోంది. ఇటు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చే అసాధారణ మార్పులకు, అటు వాతావరణ పీడన వ్యత్యాసాలకు మధ్య జరిగే ఒక గొలుసుకట్టు ప్రక్రియగా దీనిని శాస్త్రవేత్తలు పరిగణిస్తారు. భూమిపై ఉన్న వివిధ ఖండాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వ్యవసాయ విస్తీర్ణం, జలవనరుల లభ్యత, జీవవైవిధ్యం, అంతిమంగా ప్రపంచ ఆహారోత్పత్తి వ్యవస్థలపై ఎల్‌నినో చూపించే ప్రతికూల ప్రభావం అపారమైనది. ముఖ్యంగా శతాబ్దాలుగా రుతుపవనాలపైనే పూర్తిగా ఆధారపడి సాగుతున్న భారతదేశ నైరుతి రుతుపవన వ్యవస్థను, దేశ గ్రామీణ ఆర్థిక ప్రగతిని అతలాకుతలం చేయడంలో ఎల్‌నినో పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది.

శాస్త్రీయంగా పరిశీలిస్తే "ఎల్‌నినో" అనే పదం స్పానిష్ భాష నుండి ఉద్భవించింది. స్పానిష్ భాషలో దీనికి "దివ్య శిశువు" లేదా "బాల యేసు" అనే పవిత్రమైన అర్థం ఉంది. దక్షిణ అమెరికా ఖండంలోని పెరూ, ఈక్వెడార్ దేశాల పశ్చిమ తీర ప్రాంతాల్లో నివసించే స్థానిక మత్స్యకారులు శతాబ్దాల క్రితమే ఈ వింతను గుర్తించారు. సాధారణంగా ప్రతి రెండు నుండి ఏడేళ్లకు ఒకసారి, డిసెంబర్ మాసంలో అంటే క్రిస్మస్ పండుగ వచ్చే సమయానికి పసిఫిక్ మహాసముద్ర తీర జలాలు అసాధారణంగా వేడెక్కడాన్ని వారు గమనించారు. బాల ఏసు పుట్టిన కాలంలో ఈ మార్పు వస్తుంది కాబట్టి దీనికి ఎల్‌నినో అని నామకరణం చేశారు. సాధారణ పర్యావరణ పరిస్తితులలో పసిఫిక్ మహాసముద్రం పశ్చిమ భాగంలో అంటే ఆస్ట్రేలియా, ఇండోనేషియా వైపు వెచ్చని నీరు నిల్వ ఉంటుంది, తూర్పు పసిఫిక్ భాగంలో అంటే దక్షిణ అమెరికా తీరం వైపు చల్లని నీరు పైకి ప్రవహిస్తుంది. దీనిని హంబోల్ట్ లేదా పెరూ కరెంట్ అంటారు. అయితే ఎల్‌నినో సంభవించిన కాలంలో పసిఫిక్ సముద్రంపై తూర్పు నుండి పడమర వైపు వీచే వాణిజ్య పవనాలు బాగా బలహీన పడతాయి. దీనివల్ల పశ్చిమ పసిఫిక్‌లోని వెచ్చని జలాలు వెనక్కి కదిలి, మధ్య మరియు తూర్పు పసిఫిక్ మహాసముద్ర ఉపరితలానికి విస్తరిస్తాయి. ఇలా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ సగటు కంటే కనీసం 0.5 డిగ్రీల సెల్సియస్ నుండి 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ వరకు అంతకంటే ఎక్కువగా పెరిగిపోతాయి. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల కేవలం కొన్ని రోజులు కాకుండా దాదాపు తొమ్మిది నుండి పద్దెనిమిది నెలల పాటు సుదీర్ఘంగా కొనసాగుతూ వాతావరణ చక్రాలను శాసిస్తుంది.

వాతావరణ శాస్త్రంలో ఎల్‌నినో అనేది విడిగా జరిగే ప్రక్రియ కాదు, ఇది "ఎల్‌నినో-సదరన్ ఆసిలేషన్" అనే ఒక బృహత్తర సముద్ర-వాతావరణ పీడన వ్యవస్థలో అంతర్భాగం. పసిఫిక్ సముద్ర జలాల ఉష్ణోగ్రతలకు, వాతావరణంలో ఏర్పడే గాలి పీడన మార్పులకు అంటే సదరన్ ఆసిలేషన్‌కు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఇది సూచిస్తుంది. దీనికి పూర్తిగా వ్యతిరేకమైన వాతావరణ పరిస్థితిని "లా నినా" అని పిలుస్తారు, స్పానిష్‌లో దీని అర్థం 'చిన్నారి అమ్మాయి'. లా నినా కాలంలో వాణిజ్య పవనాలు మరింత బలాన్ని పుంజుకుని, తూర్పు పసిఫిక్ సముద్ర జలాలను సాధారణం కంటే విపరీతంగా చల్లబరుస్తాయి. దీని ఫలితంగా ఆస్ట్రేలియా, ఆసియా ఖండాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవిస్తాయి. ఈ విధంగా ఎల్‌నినో, లా నినా మరియు తటస్థ పరిస్థితులు ఒకదాని తర్వాత ఒకటి చక్రాకారంలో మారుతూ ప్రపంచ వాతావరణ సమతుల్యతను నిరంతరం ప్రభావితం చేస్తుంటాయి. ఈ చక్రం ఒక క్రమ పద్ధతిలో రానప్పటికీ, మానవ నిర్మిత కాలుష్యం కారణంగా దీని పునరావృత వేగం పెరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారతదేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇక్కడి వ్యవసాయ రంగానికి, వందల కోట్ల ప్రజల జీవన ప్రమాణాలకు నైరుతి రుతుపవనాలే ప్రధాన ఆధారం. మన దేశ వార్షిక వర్షపాతంలో సింహభాగం, అంటే సుమారు 70 నుండి 75 శాతం వర్షాలు కేవలం జూన్ నుండి సెప్టెంబర్ మధ్య కురిసే నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తాయి. దేశంలోని సగానికి పైగా నికర సాగు భూమి ఇప్పటికీ ఈ వర్షాలపైనే ఆధార పడి ఉంది. జలాశయాల నిండడం, భూగర్భ జలాల పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, జలవిద్యుత్ ఉత్పత్తి, గ్రామీణ మార్కెట్లలో కొనుగోలు శక్తి అన్నీ ఈ నాలుగు నెలల వర్షాలపైనే ముడిపడి ఉంటాయి. ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడినప్పుడు భూమధ్యరేఖ ప్రాంతంలో వాతావరణ పవనాల గమనం మారిపోతుంది. దీనివల్ల హిందూ మహాసముద్రం నుండి




భారతదేశం వైపు రావాల్సిన తేమతో కూడిన రుతుపవన గాలులు బలహీనపడతాయి. పసిఫిక్ సముద్రంలోని అల్పపీడన కేంద్రాలు రుతుపవన మేఘాలను తమ వైపుకు ఆకర్షించడం వల్ల భారతదేశంలో వర్షపాతం తీవ్రంగా క్షీణిస్తుంది. రుతుపవనాలు ఆలస్యంగా రావడం, వచ్చిన తర్వాత సుదీర్ఘ కాలం పాటు వర్షాలు పడకుండా పొడి వాతావరణం ఏర్పడటం, సకాలంలో పంటలు వేయలేక పోవడం వంటి నష్టాలు సంభవిస్తాయి.

భారతదేశ వాతావరణ చరిత్రను, గత రెండు శతాబ్దాల గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే, దేశంలో సంభవించిన ఘోరమైన కరవులకు, ఎల్‌నినో సంవత్సరాలకు మధ్య అత్యంత స్పష్టమైన, విడదీయరాని సంబంధం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు నిరూపించారు. గడచిన 150 ఏళ్ల కాలంలో దేశంలో సంభవించిన పెద్ద కరవులలో దాదాపు 80 శాతానికి పైగా ఎల్‌నినో ప్రభావం వల్లనే జరిగాయి. చారిత్రాత్మకంగా చూస్తే 1877, 1899, 1918, 1965, 1972, 1982, 1987, 2002, 2009, 2015, ఆ తర్వాత 2023-24లలో ఎల్‌నినో తీవ్ర రూపం దాల్చింది. బ్రిటీష్ పాలనలో 1877లో వచ్చిన ఎల్‌నినో వల్ల 'మహా కరవు' ఏర్పడి దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆకలితో ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1918 నాటి ఎల్‌నినో కాలంలో దేశంలో వర్షపాతం ఏకంగా 25 శాతం మేర పడిపోయి ఆహార సంక్షోభం తలెత్తింది. ఆధునిక కాలంలో 2002 వ సంవత్సరంలో ఏర్పడిన ఎల్‌నినో వల్ల దేశవ్యాప్తంగా నైరుతి వర్షపాతంలో దాదాపు 19 శాతం లోటు నమోదైంది, ఇది దశాబ్ద కాలంలోనే అత్యంత ఘోరమైన కరవుకు దారితీసింది. మళ్లీ 2009లో ఎల్‌నినో సృష్టించిన బీభత్సం వల్ల వర్షపాతం 22 శాతం తగ్గి, దేశంలోని సగానికి పైగా జిల్లాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చింది. 2015లో నమోదైన బలమైన ఎల్‌నినో వల్ల మహారాష్ట్రలోని మరత్వాడ, బుందేల్‌ఖండ్ వంటి ప్రాంతాల్లో తాగునీటికి కూడా హాహాకారాలు వ్యక్తమయ్యాయి. ఇటీవలి కాలంలో కూడా ఎల్‌నినో కారణంగా దేశంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరి, శీతాకాలం నిడివి తగ్గిపోవడం మనం గమనించాం.

ఈ ప్రక్రియ కేవలం భారత ఉపఖండానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్త వాతావరణాన్ని అతలాకుతలం చేస్తుంది. ఎల్‌నినో క్రియాశీలంగా ఉన్నప్పుడు పసిఫిక్ మహాసముద్రానికి తూర్పున ఉన్న దక్షిణ అమెరికా పశ్చిమ తీర దేశాలైన పెరూ, ఈక్వెడార్, చిలీలలో సాధారణంగా పొడిగా ఉండే ఎడారి ప్రాంతాలలో అసాధారణంగా మేఘమథనం జరిగి అత్యంత భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం సంభవిస్తాయి. దీనికి భిన్నంగా పశ్చిమ పసిఫిక్ సరిహద్దుల్లో ఉన్న ఆస్ట్రేలియా, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్ వంటి దేశాలలో తీవ్రమైన అనావృష్టి ఏర్పడుతుంది. ఆస్ట్రేలియాలోని అడవుల్లో కార్చిచ్చు రేగి వేలాది ఎకరాల వనసంపద, వన్యప్రాణులు బూడిదవుతాయి. ఆఫ్రికా ఖండంలోని హార్న్ ఆఫ్ ఆఫ్రికా అంటే ఇథియోపియా, సోమాలియా వంటి ప్రాంతాల్లో వర్షాలు లేక పశుగ్రాసం నశించి, పశువులు విచ్చలవిడిగా మరణిస్తాయి మరియు మానవ జీవనానికి తీవ్ర ఆహార కొరత ఏర్పడుతుంది. అదే సమయంలో బ్రెజిల్, కొలంబియా వంటి అమెజాన్ అడవుల పరిసర ప్రాంతాలలో కరువు పరిస్థితులు ఉంటే, అమెరికా సంయుక్త రాష్ట్రాల దక్షిణ భాగంలో శీతాకాలంలో చలి గాలుల తీవ్రత పెరిగి, భారీ వర్షపాతం నమోదవుతుంది.

వాతావరణ మార్పులతో పాటు సముద్ర జీవవైవిధ్యం, జల పర్యావరణ వ్యవస్థలపై ఎల్‌నినో దెబ్బ అత్యంత ఘోరంగా ఉంటుంది. పెరూ తీర ప్రాంతం ప్రపంచంలోనే అతిపెద్ద మత్స్య సంపద కేంద్రాలలో ఒకటి. సాధారణ రోజుల్లో ఇక్కడ 'అప్‌వెల్లింగ్' అనే ప్రక్రియ ద్వారా సముద్రపు అడుగుభాగం నుండి పోషకాలతో కూడిన చల్లని నీరు పైకి వస్తుంది. ఈ పోషకాలను తిని బతికే 'ప్లాంక్టన్' అనే సూక్ష్మజీవులు, వాటిపై ఆధారపడే 'ఎంకోవి' వంటి చిన్న చేపలు ఇక్కడ కోట్లాదిగా వృద్ధి చెందుతాయి. కానీ ఎల్‌నినో వల్ల వెచ్చని నీరు వచ్చి చేరడంతో ఈ అప్‌వెల్లింగ్ ప్రక్రియ పూర్తిగా ఆగిపోతుంది. నీటిలో పోషకాలు లేక, వేడిని తట్టుకోలేక చేపలు చనిపోవడం లేదా వేరే ప్రాంతాలకు వలస పోవడం జరుగుతుంది. ఇది పెరూ దేశపు ఆర్థిక వ్యవస్థను, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తుంది. మరోవైపు, సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల సముద్ర అంతర్భాగంలోని పగడపు దిబ్బలు తమ రంగును, జీవాన్ని కోల్పోయి చనిపోతాయి. దీనినే 'కోరల్ బ్లీచింగ్' అంటారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన ఆస్ట్రేలియా 'గ్రేట్ బారియర్ రీఫ్' ఎల్‌నినో కాలంలోనే అత్యధికంగా నష్టపోయిందని పర్యావరణ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

మానవ సమాజానికి అత్యంత హాని కలిగించే అంశం వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థలపై ఎల్‌నినో వల్ల రుతుపవనాలు వైఫల్యం చెందితే, ఆసియా ఖండంలో ప్రధాన ఆహార పంటలైన వరి, మొక్కజొన్న, సోయాబీన్, చెరకు, పత్తి, నూనెగింజల సాగు తీవ్రంగా దెబ్బతింటుంది. నీటి కొరత వల్ల సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. రైతులు పంటలను కాపాడు కోవడానికి భూగర్భ జలాలను విపరీతంగా తోడటం వల్ల భూగర్భ జలమట్టాలు పాతాళానికి పడిపోతాయి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం మార్కెట్లో డిమాండ్ మరియు సప్లై మధ్య సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఫలితంగా నిత్యావసర వస్తువుల, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతాయి, ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు సన్నగిల్లి, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించి, పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకాలు కూడా పడిపోతాయి. అంటే గ్రామీణ పొలాల్లో ప్రారంభమయ్యే ఎల్‌నినో సంక్షోభం, దేశ జీడీపీ వృద్ధి రేటును తగ్గించేంత శక్తివంతంగా మారుతుంది.

ప్రస్తుత ఆధునిక కాలంలో గ్లోబల్ వార్మింగ్ లేదా భూతాపం తీవ్రత పెరగడం వల్ల ఎల్‌నినో ప్రవర్తన మరింత సంక్లిష్టంగా, అనూహ్యంగా మారుతోందని అంతర్జాతీయ వాతావరణ పరిశోధకులు మరియు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. శిలాజ ఇంధనాల వాడకం, అడవుల నరికివేత, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల వల్ల భూగోళంతో పాటు సముద్రాలు కూడా వేడెక్కుతున్నాయి. ఈ అదనపు వేడి పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ఏర్పడే ఫ్రీక్వెన్సీని, దాని తీవ్రతను పెంచుతోంది. ఒకప్పుడు ప్రతి 5 నుండి 7 సంవత్సరాలకు ఒకసారి వచ్చే తీవ్ర ఎల్‌నినో, ఇప్పుడు ప్రతి 2 నుండి 3 సంవత్సరాలకే సంభవిస్తోంది. కొన్ని అత్యాధునిక కంప్యూటర్ నమూనాల అంచనాల ప్రకారం, ఈ శతాబ్దం చివరి నాటికి 'సూపర్ ఎల్‌నినో' వంటి వినాశకరమైన వాతావరణ సంఘటనల సంఖ్య రెట్టింపు అయ్యే ప్రమాదం ఉంది. వాతావరణ మార్పు మరియు ఎల్ నినోల కలయిక వల్ల రాబోయే 2027 సంవత్సరం భూగోళ చరిత్రలోనే అత్యంత వేడి సంవత్సరంగా మారొచ్చని అంతర్జాతీయ పరిశోధనలు ముందే హెచ్చరిస్తున్నాయి.

ఈ విపత్కర పరిస్థితులను ముందే ఊహించి నష్టాన్ని తగ్గించడానికి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో వాతావరణ శాస్త్ర పరిశోధనలు వేగవంతమయ్యాయి. ప్రపంచ వాతావరణ సంస్థ తో పాటు భారతదేశంలోని భారత వాతావరణ శాఖ వంటి సంస్థలు ఆధునిక ఉపగ్రహాలు, సముద్ర ఉపరితలంపై అమర్చిన బాయ్‌లు, రాడార్ వ్యవస్థలు మరియు సూపర్ కంప్యూటర్ డైనమిక్ మోడల్స్ ద్వారా ఎల్‌నినో రాకను 6 నుండి 9 నెలల ముందే అంచనా వేస్తున్నాయి. ఈ ముందస్తు హెచ్చరికలు ప్రభుత్వాలకు విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించుకోవడానికి, రైతులకు తగిన సలహాలు ఇవ్వడానికి అమూల్యమైన సమయాన్ని అందిస్తున్నాయి. ముందస్తు సమాచారం లభించినప్పుడు దేశాలు తమ ఆహార నిల్వలను, నీటి వనరులను ముందే ప్రణాళికాబద్ధంగా మేనేజ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.

ఈ క్రమంలోనే ప్రస్తుత 2026 సంవత్సరానికి సంబంధించిన ముందస్తు అంచనాలు దేశాన్ని కలవరపెడుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న సూపర్ ఎల్-నినో ప్రభావం ప్రస్తుత 2026 నైరుతి రుతుపవనాలపై జూలై నెల నుంచి స్పష్టంగా కనిపించడం ప్రారంభమవుతుందని నిపుణులు గట్టిగా అంచనా వేస్తున్నారు. జూన్ ఒకటవ తేదీన ఎప్పటిలాగే కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు దేశ అంతర్భాగంలోకి ముందుకు కదలడంలో తీవ్రమైన ఇబ్బందులు, ఆటంకాలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా జూలై మాసంలో ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశ ప్రాంతాలలో వర్షపాతంలో భారీ లోటు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దీనివల్ల దేశానికి అన్నపూర్ణలుగా నిలిచే పంజాబ్, హర్యానాతో పాటు దేశ రాజధాని ప్రాంతమైన ఢిల్లీలలో తీవ్రమైన కరవు పరిస్థితులు రావచ్చునని వాతావరణ మోడల్స్ సూచిస్తున్నాయి. అదేవిధంగా పారిశ్రామిక, వ్యవసాయ ప్రాధాన్యమున్న మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లలో కూడా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉంది.

అయితే, అత్యంత ఆసక్తికరంగా మరియు ఆందోళనకరంగా జూలై - ఆగస్టు నెలల్లో దక్షిణాది రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో విపరీతమైన అకాల వర్షాలు కురిసి హఠాత్తుగా వరదలు రావచ్చునని తాజా అంచనాలు చెబుతున్నాయి. ఈ వాతావరణ వైపరీత్యం మరింత ముదిరి సెప్టెంబరు మాసంలో ముఖ్యంగా చెన్నై మహానగరంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సముద్ర తీర ప్రాంతాల్లో తీవ్రమైన సమస్యలను తెచ్చిపెట్టవచ్చునని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు గనుక ఇదే రీతిన కొనసాగితే, ఈ సూపర్ ఎల్-నినో వినాశకర ప్రభావం కారణంగా తదుపరి వచ్చే 2026-27 రబీ సీజన్ పంటల సాగుపై కూడా తీవ్రమైన వ్యతిరేక ప్రభావం పడుతుంది, ఇది దేశ ఆహార లభ్యతను ప్రశ్నార్థకం చేయవచ్చు.

భారతదేశం లాంటి భారీ జనాభా, వ్యవసాయ ఆధారిత వ్యవస్థ కలిగిన దేశం ఎల్‌నినో సవాళ్లను తట్టుకోవాలంటే కేవలం వాతావరణ అంచనాలపైనే కాకుండా క్షేత్రస్థాయిలో నిర్మాణాత్మక ముందస్తు వ్యూహాలపై దృష్టి పెట్టాలి. వర్షపాతం తగ్గుతుందనే సంకేతాలు ఉన్నప్పుడు జల సంరక్షణ పద్ధతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. సాంప్రదాయ చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించే 'వాటర్ హార్వెస్టింగ్' పద్ధతులను విస్తృతంగా అమలు చేయాలి. వ్యవసాయంలో సాంప్రదాయ పద్ధతుల నుండి మారి తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే డ్రిప్ సేద్యం, స్ప్రింక్లర్ నీటిపారుదల వంటి సూక్ష్మ నీటిపారుదల సాంకేతికతను ప్రోత్సహించాలి. అలాగే, కరువును, అధిక వేడిని తట్టుకుని నిలబడగలిగే స్వల్పకాలిక పంట రకాలను, ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచాలి. నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, చెరకు వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే తృణధాన్యాలు, పప్పుధాన్యాల వైపు పంటల వైవిధ్యీకరణ వైపు రైతాంగాన్ని మళ్లించాలి.

భారతదేశం వంటి దేశాలలో ఎల్‌నినో అనేది కేవలం పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఒక సాధారణ భౌతిక మార్పు మాత్రమే కాదు; అది దేశ ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాల భవితవ్యాన్ని మార్చే ఒక సంక్లిష్ట శక్తి. ప్రకృతి ప్రసాదించే సంకేతాలను శాస్త్రీయ దృక్పథంతో నిరంతరం గమనిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినప్పుడే మనం ఈ సవాళ్లను అధిగమించగలం. స్థిరమైన నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులు, అడవుల పెంపకం మరియు పటిష్టమైన ప్రభుత్వ విధానాల కలయిక ద్వారానే ఎల్‌నినో తెచ్చే కరువుల తీవ్రతను తగ్గించి, దేశ ఆహార భద్రతను, జల భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని భవిష్యత్ తరాల కోసం సురక్షితంగా కాపాడు కోగలము. ప్రకృతి సంకేతాలను గమనిస్తూ శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగినప్పుడే వాతావరణ సవాళ్లను అధిగమించి ఆహార భద్రత, జల భద్రత, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

---

## ప్రజల ముంగిటకే పాలన- మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు

### - వేములవాడలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' వార్డు సభలు..



రాజన్న సిరిసిల్ల, జూన్ 4: (నేటినిజం ప్రతినిధి): :ప్రజల సమస్యలను వార్డు స్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారం అందించడమే 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' లక్ష్యమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు అన్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 14, 15, 25వ వార్డుల్లో గురువారం నిర్వహించిన ప్రత్యేక వార్డు సభల్లో ఆయన పాల్గొని ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల గడప వద్దకే పాలనను తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వార్డుల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలివర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి కుటుంబం పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపడుచుకు ఇందిరమ్మ చీరరాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తోందని తెలిపారు. గతంలో మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే పరిమితమైన ఈ పథకాన్ని విస్తరించి అర్హులైన అందరికీ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తడి?పొడి చెత్త వేరు చేయాలిపట్టణ పరిశుభ్రత కోసం ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరిన చైర్మన్, చెత్తను రోడ్లపై లేదా కాలువల్లో వేయకుండా ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. త్వరలో ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించి డ్రైనేజీల శుభ్రత, బ్లీచింగ్, ఫాగింగ్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత అవసరంభూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని చైర్మన్ సూచించారు. దీనివల్ల నీటి మట్టాలు పెరిగి భవిష్యత్తులో నీటి కొరత సమస్యను తగ్గించవచ్చని వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టితాగునీరు, డ్రైనేజీ, వీధిదీపాలు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తుమ్మధు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, ఎస్సై రామ్మోహన్, వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్లోబల్ సిటీగా కరీంనగర్..

### - హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న మేయర్

కరీంనగర్, జూన్ 4:(నేటినిజం ప్రతినిధి) "కరీంనగర్ చాలా వేగంగా గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తోంది.. ఇది తెలంగాణకే గర్వకారణం" అని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉత్తరాఖం డ్‌లోని ఋషికేశ్లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశంలో ఆయన పూర్తి హిందీలో ప్రసంగించి విశేషంగా ఆకట్టుకు న్నారు. సమావేశంలో పాల్గొన్న పుష్కర్ సింగ్ ధామి, మంత్రులు, ఎంపీ లు, దేశవ్యాప్తంగా వచ్చిన మేయ ర్లు, అధికారులకు అభివాదాలు తెలిపిన అనంతరం కరీంనగర్ నగరాభివృద్ధి, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై మేయర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు."స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదు.. ప్రజల జీవితాల ను సులభతరం చేయడం" అని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీస్ మిషన్ కింద ఎంపికైన కరీంనగర్‌లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిం చారు. నగరంలో స్మార్ట్ రోడ్లు, ఆధునిక ఫుట్‌పాత్‌లు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీటీవీ నిఘా, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతా చర్యలు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, అందమైన పార్కుల నిర్మాణం వంటి పలు కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యం గా అభివృద్ధి పనులు కొనసాగ ుతున్నాయని చెప్పారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారిగా కరీంనగ ర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై బీజేపీ విజయం సాధించి మేయర్ పదవిని దక్కించుకోవడం తెలంగాణ బీజేపీకి చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్‌కు బ్రేక్

### - జిల్లాలో ఒక్కరోజే 55 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు - నంబర్ ప్లేట్లు తొలగించిన 24 వాహనాల గుర్తింపు



రాజన్న సిరిసిల్ల, జూన్ 4: (నేటినిజం ప్రతినిధి): మద్యం సేవించి వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు తొలగించడం లేదా మార్ఫింగ్ చేయడం వంటి ఉల్లంఘనలపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. బుధవారం రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 55 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే నంబర్ ప్లేట్లు తొలగించిన, కనిపించకుండా మార్ఫింగ్ చేసిన 24 వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోజువారీగా వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు భద్రతతో పాటు నేరాల నియంత్రణలో భాగంగా నంబర్ ప్లేట్ల తనిఖీలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి నంబర్ ప్లేట్ స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరైన నంబర్ ప్లేట్లు ఉండడం వల్ల దొంగిలించబడిన వాహనాలను గుర్తించడం, నేరాలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని వివరించారు. నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ కనిపించకుండా అడ్డుపెట్టడం, సగం నంబర్లు తొలగించడం లేదా మార్ఫింగ్ చేసి వాహనాలు నడిపితే చీటింగ్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## నగునూరి రమేష్ చారీకి విశ్వకర్మ లెజెండ్ అవార్డు -2026

కరీంనగర్, జూన్ 4:(నేటి నిజం (ప్రతినిధి) కరీంనగర్ చింతకుంట కి చెందిన నగునూరి రమేష్ చారీ కి విశ్వకర్మ లెజెండ్ అవార్డు -2026 దక్కింది. విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ దశాబ్ది ఉత్సవాలలో భాగంగాహైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రనీ లో నిర్వహించిన ప్రత్యేక ప్రోగ్రాంలో నగునూరి రమేష్ చారీ కి విశ్వకర్మ లెజెండ్ అవార్డు ను ప్రధానం చేశారు. విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వ్యవస్థాపకులు విశ్వనాథుల పుష్ప గిరి , కమిటీ సభ్యులు, ముఖ్య అతిథులు గా విచ్చేసిన ఏసీపి, కిరణ్ కుమార్ , అడిషనల్ కలెక్టర్ వెంకటచారీ చేతుల మీదుగా నగునూరి రమేష్ చారి ఈ పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డు దక్కిన సందర్భంగా రమేష్ చారి



విశ్వకర్మ లెజెండ్ అవార్డు రావడం గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. "భారత దేశం లోనే కరీంనగర్ సిల్వర్ పిలిగ్రీ హ్యాండ్ క్రఫీ కళకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ దిశలోనే ఈ కళ ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గుర్తించి, ప్రోత్సహించారన్నారు. ఈ అవార్డు తన పట్ల మరింత బాధ్యతను పెంచిందని , విశ్వకర్మల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.